
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 16-5-2025 15/-


# కుల జనగణన






సహజీవన భావాల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 47 సంచిక: 20 హైదరాబాద్
శుక్రవారం 16 మే 2025 రూ.15-00
17 జీఖఅదహ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

వినాశం తప్పదు – ఇతరుల్ని నవ్వించడానికని అబద్ధాలు సృష్టించే వ్యక్తికి– వినాశం తప్పదంటే తప్పదు!

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


## లోపల...


| | |
|---|---|
| ఆపరేషన్ సింధూర్ ...... | 04 |
| కుల జనగణన ...... | 05 |
| ముస్లిం సముదాయం శీల స్వభావాల నిర్మాణం ...... | 10 |
| ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| ఇస్లామీయ ఉద్యమ భవిష్యత్తు – 2 ...... | 20 |
| చరితార్థులు-2 : షాకిర్ అలీ బారిష్టర్ ...... | 23 |
| తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు-2 ...... | 24 |
| ముస్లిం ఆదర్శ దినచర్య – 2 ...... | 28 |
| కోపం వద్దు సహనం ముద్దు ...... | 31 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |


**యుద్ధం వద్దు...**



ఆపరేషన్ సింధూరుతో
విరిగినయట కొమ్ములు
ఇంకెందుకు ప్రగల్భాలు
నోర్మూసో్కో దద్దమ్మలు!
యుద్ధమంటు జరిగితే
మరి ఇరువైపుల నష్టం
అమాయక పౌరులకు
ఎవరు తీర్చలేని కష్టం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ఆపరేషన్ సింధూర్

**ఉగ్రఘాతుకానికి** పాల్పడిన పాక్ ప్రేరేపిత టెర్రరిస్టులపై ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ముఖ్యంగా కల్నల్ సోఫియా ఖురైషీ పేరు ప్రముఖంగా ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ఆమెతో పాటు వింగ్ కమాండర్ వ్యోమికా పేరు కూడా చర్చకు వచ్చింది. ఈ ఇద్దరు మహిళలు భారత సైనికదళాల శక్తిసామర్థ్యాలను చాటి చెప్పారు.

పహల్గాం దాడి తర్వాత దేశంలో హిందూ ముస్లిం చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్న వారికి జవాబిస్తూ అనేకమంది, ఉగ్రదాడిలో బాధితులను కాపాడిన వారు కూడా చాలా మంది ముస్లిములే అని స్పష్టంగా చెప్పారు. ఒక బాధిత అమ్మాయి తన తండ్రిని కోల్పోయానని చెబుతూ, కాని తనకు ఇద్దరు అన్నలు దొరికారని చెప్పిన మాటలు కూడా దేశం విన్నది. అయినా దేశంలో మతోన్మాదాన్ని రాజేయ డానికి ప్రయత్నించేవాళ్ళు తమ ప్రయత్నాలు ఆపలేదు. ఇప్పుడు మరో ముస్లిం మహిళ సోఫియా ఖురైషీ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు బుద్ధిచెప్పడంలో ముఖ్యపాత్ర పోషించింది. ఈ వార్త తర్వాతైనా కనీసం ఈ మతతత్వ శక్తులకు కాస్త మంచి బుద్ధి వస్తుందా?


నిజానికి సంయమనంతో ఆలోచించేవాళ్ళు చాలా మంది ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో కొత్తగా పెళ్ళయిన జంట, కేవలం పెళ్ళయిన రెండు మూడు రోజులకే భర్తను కోల్పో యిన నవవధువు హిమాంషీ శోకాన్ని మనం వర్ణించ గలమా? అలాంటి స్థితిలో కూడా నావికాదళాధికారి వినయ్ నావల్ భార్య అయిన ఆమె మత వైషమ్యం వద్దని, ఈ దాడి సాకుతో ముస్లిములపై, కశ్మీరీలపై విద్వేషం రెచ్చగొట్టవద్దని చెప్పారు. కాని ఆ వెంటనే ఈ మతోన్మాద శక్తులు అత్యంత అసభ్యంగా, అశ్లీలంగా ఆమెను ట్రోల్ చేసాయి. కాని ఆమె వెనక్కి తగ్గలేదు. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఆమె భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు. తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అడిగితే "ఎవరి మనోవైఖరినీ తాను మార్చలేనని.. కాని వైషమ్యం అనేది ఉండరాదని, అమాయకులకు హాని జరగరాద"ని తన అభిప్రాయాన్ని నిర్దిష్టంగా, నిష్కర్షగా ప్రకటించింది.

మరోవైపు ఆల్ట్ న్యూస్ ద్వారా నిజనిర్ధారణ చేసే ముహమ్మద్ జుబైర్, నిజనిర్ధారణలు చేసినందుకు కోర్టు కేసులు, జైళ్లు ఎదుర్కుంటున్న జుబైర్ పాకిస్తాన్ ప్రాపగాండాను తిప్పి కొడుతూ డిజిటల్ యుద్ధం పాకిస్తాన్ తో చేశాడు. పాకిస్తాన్ అబద్ధపు ప్రచారాల నిజాలు నిగ్గుదేల్చుతూ ఆన్ లైన్ యుద్ధం చేశాడు. భారత సైన్యంలో సిక్కు రెజిమెంటుపై పాకిస్తాన్ ప్రాపగాండాను పటాపంచలు చేశాడు. పాకిస్తాన్ ఐదు భారత విమానాలు కూల్చేసిందన్న మాటలో నిజాలు లేవని నిర్ధారణ చేసి చెప్పాడు. ఇండియాపై దాడి చేశామంటూ పాకిస్తాన్ చేసిన ప్రాపగాండ శుద్ధ అబద్ధమని, పాత వీడియోలు, ఈరాన్ వీడియోలు షేర్ చేసి పాకిస్తాన్ ప్రాపగాండ చేస్తుందని రుజువులు చూపించాడు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పిన తర్వాత ఫారిన్ సెక్రటరీ విక్రమ్ మిస్రీ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు ఏర్పడకుండా అడ్డుకోడానికి, దేశంలో మతఘర్షణలు రెచ్చగొట్టడానికి పహల్గాం దాడులు చేశారని అన్నారు. కాని భారత ప్రజలు పాకిస్తాన్ దుర్మార్గపు ప్రయత్నాలు ఫలించకుండా చేశారని అన్నారు. అంటే టెర్రరిస్టుల ముఖ్యోద్దేశ్యం దేశంలో మతపరమైన ఘర్షణలు రెచ్చగొట్టడం అని స్పష్టంగా తెలుస్తోంది.

కాని దేశంలో హిందూ ముస్లిం చిచ్చుపెట్టాలని ప్రయ త్నించే వారు తమ ప్రయత్నాలు మానుకోవడం లేదు. ఉత్తరప్రదేశ్, సోన్ భద్ర జిల్లాలో ఒక ముస్లిం టీచర్ జెబా అఫ్రోజ్ సోషల్ మీడియాలో హిమాంషీకి మద్దతుగా పోస్టు చేసినందుకు ఆమెను ఉద్యోగం నుంచి తొలగిం చారు....

కవరు కథనం | అబ్దుల్ వాహెద్




# కుల జనగణన

**జనాభా లెక్కల్లో** కులగణన జరిపిస్తామని కేంద్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సలీమ్ ఇంజనీర్ స్వాగతించారు. దేశంలో సామాజిక న్యాయం సాధించడానికీ కులాల డాటా చాలా అవసరమని ఆయన అన్నారు. దేశంలో ఇప్పటికీ కులం చాలా బలంగా ఉంది. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం ఎంత ఉందో దానివల్ల తెలుస్తుంది. కులగణన వల్ల లభించే డాటా రిజర్వే షన్ల విధానాన్ని మరింత మెరుగుపరచడానికి ఉప యోగపడుతుంది.

మోడీ ప్రభుత్వం హఠాత్తుగా కులగణన గురించి చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఎప్పుడు ఎలా ఈ సర్వే నిర్వహిస్తారన్నది ఇంకా చెప్పలేదు. ఇప్పుడప్పుడే జరిగే సూచనలు కూడా లేవు.

ఇప్పుడు కులగణన గురించి చేసిన ఈ ప్రకటన నిజానికి బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిన రాజకీయ ఎత్తుగడగానే చాలా మంది చూస్తున్నారు. కారణమేదైనా కానీ దేశంలో 1931 తర్వాత మొదటిసారి దేశవ్యాప్తంగా కులగణన గురించి ప్రకటన రావడం అరుదైన సందర్భమే.

కాని, సంఘ్ పరివార్ శక్తులకు ఇది అనూహ్యమైన పరిణామం. 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి కులగణన కోసం బలంగా డిమాండ్ చేసింది. కాని కులగణన విభజన రాజకీయమని, అర్బన్ నక్సళ్ళ ఎజెండా అని బీజేపీ విమర్శించింది.

ఈ సందర్భంగా వి.పి.సింగ్ ప్రభుత్వం గుర్తుకు రావడం సహజం. ఎందుకంటే అప్పట్లో వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయడానికి పూనుకున్నప్పుడే విద్యార్థుల రిజర్వేషన్ల రగడకు బీజేపీ ఊతమిచ్చి, అవిశ్వాస తీర్మానం ద్వారా వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూలదోసింది. కాస్త

వెనక్కు వెళ్ళి పరిశీలిస్తే 1970ల్లో బీహారులో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన కర్పూరీ ఠాకూర్‌ను కూడా ఇలాగే అప్పటి జనసంఘ్ అధికారం నుంచి తొలగించింది. అప్పట్లో ముంగేరీలాల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా కర్పూరీ ఠాకూర్ ఈ రిజర్వేషన్ల అమలుకు ప్రయత్నించారు. బీజేపీ, పూర్వాశ్రమంలో జనసంఘ్ ఎన్నడూ వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను ఒప్పుకోలేదు.

కాని ఇప్పుడు కులగణన గురించి ప్రకటించడం నిజంగానే చాలా మందికి ఊహించని పరిణామం. సామాజిక న్యాయం కోసం పోరాడిన సావిత్రిబాయీ ఫూలే గురించిన చిత్రాన్ని కూడా భరించడానికి సిద్ధంగా లేని వాళ్ళు, సామాజిక న్యాయం తామే సాధిస్తామంటూ ఇప్పుడు కులగణన చేయిస్తామనడం నిజంగా ఆశ్చర్యకరమైన పరిణామమే.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశంలో హిందూ ముస్లిం చిచ్చుపెట్టే ప్రయత్నాలు చాలా తీవ్ర స్థాయిలో చేశారు. ఛత్తీస్ గఢ్ బీజేపీ అయితే ఒకడుగు ముందుకేసి టెర్రరిస్టులు కులం అడగలేదు, మతం అడిగారంటూ చేసిన ట్వీటు విమర్శలపాలయ్యింది. ఈ ట్వీటు వెనుక కూడా కులగణనపై విమర్శ, దాడి ఉందన్నది కాదనలేని వాస్తవం. కాని పహల్గాం ఉగ్రదాడి తర్వాత నిఘా వైఫల్యమే ఎక్కువగా చర్చనీయాంశం కావడంతో వ్యూహం మార్చుకోక తప్పలేదు. కులగణన గురించి ప్రకటన ద్వారా పహల్గాం నుంచి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం జరిగిందని కొందరి అభిప్రాయం.

కాని కులగణన, బీసీ రిజర్వేషన్ల సమస్య చాలా సంక్లిష్టమైనది. పదేళ్ళ క్రితం ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ రిజర్వేషన్లపై పునస్సమీక్ష జరపాలని చేసిన వ్యాఖ్య బీహార్ బీజేపీ విజయావకాశాలపై చన్నీళ్ళు కుమ్మరించింది.

ఇప్పుడు బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కులగణన చేయిస్తామంటోంది. గతంలో కులగణన జరపడం అసాధ్యమని చెప్పిన ప్రభుత్వమే ఇప్పుడు కులగణనకు సిద్ధపడింది. 'బటేంగేతో కటేంగే' అంటూ నినాదాలిచ్చినవారు, 'ఏక్ హైతో సేఫ్ హై' నినాదాలిచ్చినవారు, ఆ విధంగా కులగణనను వ్యతిరేకించిన వారు ఇప్పుడు కులాలను లెక్కించడానికి సిద్ధపడ్డారు.

ఎందువల్ల బీజేపీ మనసు మార్చుకుని కులగణనకు ఒప్పుకుందన్నది కాస్త లోతుగా ఆలోచించవలసిన విషయం.

కులగణన చేయించడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటన వచ్చిన వెంటనే రెండు రకాల వాదనలు మన ముందుకు వచ్చాయి. కొందరు దీన్ని మోడీ మాస్టర్ స్ట్రోక్ అనడం

**వక్ఫ్ చట్టంపై ముస్లిముల ప్రతిక్రియ ఈ నిర్ణయం వెనుక ఉందని కొందరు చేస్తున్న విశ్లేషణ ఆలోచించదగింది. వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా ముస్లిములు ఒక్కటై నిలబడ్డారు. నిజానికి పౌరసత్వ సవరణ చట్టం విషయంలోనూ ముస్లిముల్లో ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. వక్ఫ్ చట్టంపై మొత్తం ముస్లిం సముదాయం ఒక్కతాటిపై నిలబడడం బీజేపీని కుదిపేసిందని, ముస్లిముల్లో కులపరమైన విభేదాలు రాజేయ డానికి వేసిన ఎత్తుగడే ఈ నిర్ణయానికి కారణమని కొందరి అభిప్రాయం.**

మొదలు పెట్టారు. రాహుల్ గాంధీ కులగణన అంటూ ప్రజల మద్దతు కోసం చేస్తున్న ప్రయత్నాలపై మోడీ చన్నీళ్ళు కుమ్మరించారని, ఇది ప్రతిపక్షంపై సర్జికల్ స్ట్రైక్ అని, రాహుల్ గాంధీకి ఇప్పుడు మాట్లాడ్డానికి ఏమీ మిగల్లేదని, ఇక ప్రతిపక్షాల పని అయిపోయిందని ఊదరగొడుతున్నవాళ్ళు కొంతమంది. ఈ రకమైన చర్చలు మనం టీవీల్లో చూస్తూనే ఉంటాం. మరోవైపు రాహుల్ గాంధీ ప్రభుత్వం మెడలు వంచి ఒప్పించారని, రాహుల్ గాంధీ ఒత్తిడి వల్లనే మోడీ కులగణనకు ఒప్పుకున్నారని, రాహుల్ గాంధీయే నిజానికి షాడో ప్రభుత్వం నడిపిస్తున్నారని చెప్పుకునేవాళ్ళు కొంతమంది. ఈ రెండు రకాల వాదనలు మనం విన్నాం. కాంగ్రెసు పార్టీ చాలా కాలంగా కులగణనకోసం డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ మాటను ఎవరూ కాదనలేరు. కాని కాంగ్రెస్ ఒత్తిడి వల్లనే మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారా అంటే... అది అర్థసత్యమే. నిజానికి ఈ నిర్ణయం వెనుక కొన్ని రాజకీయ లెక్కలున్నట్లు కాస్త లోతుగా చూస్తే అర్థమవుతుంది.

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌తో ప్రధాని మోడీ భేటీ అయిన వార్త ఇటీవల వచ్చింది. అక్కడ చర్చలేం జరిగాయో మనకు తెలియదు, కాని బహుశా కులగణన గురించి చర్చ జరిగి ఉంటుందని కొందరు బలంగా అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే బీజేపీ కులగణనను ఇంతవరకు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చిన పార్టీ. స్వయంగా ప్రధాని మోడీ తనకు కేవలం నాలుగు కులాలే తెలుసని అన్నారు. పేదలు, యువత,

మహిళలు, రైతులు... వీళ్ళే తనకు తెలుసని అన్నారు. బీజేపీ నాయకుడు అనురాగ్ ఠాకూర్ పార్లమెంటులో మాట్లాడుతూ తన కులమేదో తెలియని వారు కులగణన గురించి మాట్లాడు తున్నారని ఎకసెక్కాలు చేశాడు. మోడీ ప్రభుత్వం 2021లో పూర్తి బలంతో ఉన్నప్పుడు పార్లమెంటులో కులగణన చేయించే ఉద్దేశ్యం తమకెంత మాత్రం లేదని కుండబద్దలు కొట్టిన విషయం కూడా అందరికీ తెలిసిందే. కాని, హఠాత్తుగా ఇప్పుడు మనసు మారిపోవడానికి కారణమేమిటో!?

ఈ నిర్ణయం వెనుక రాజకీయ లెక్కల గురించి కొందరు విశ్లేషిస్తు న్నారు. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో బీజేపీకి ఉత్తరప్రదేశ్‌లో ఊహించలేని ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ ఎన్నడూ ఊహించని పరిణామమది. మహారాష్ట్రలో కూడా ఎదురుదెబ్బలు తగిలాయి. కాని అక్కడ పార్టీల మార్పిడి రాజకీయాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు. కాని ఉత్తరప్రదేశ్ పరిస్థితి అలా కాదు. అక్కడ ఎదురైన ఓటమి జాతీయ రాజకీయాలపై ప్రభావం వేస్తుంది. ఉత్తరప్రదేశ్, బీహారుల్లో బీజేపీ పరిస్థితి బాగోలేదన్నది స్పష్టం.

కొందరు విశ్లేషకుల ప్రకారం 2024 ఎన్నికల ఫలితాల తర్వాతి నుంచే సంఘపరివార్ అగ్రనేతల్లో కులగణన గురించి చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ కుల గణన చేయించవలసి వస్తే ఎలా చేయించాలన్న విషయంలో కూడా వ్యూహరచనలు జరిగి నట్లు కొందరి భోగట్టా.

ఇప్పుడు ఈ నిర్ణయం రావడానికి కారణం నిజానికి పహల్గాం దాడి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమూ కాదు, బీహారు ఎన్నికలూ కాదు... వక్ఫ్ చట్టంపై ముస్లిముల ప్రతిక్రియ ఈ నిర్ణయం వెనుక ఉందని కొందరు చేస్తున్న విశ్లేషణ ఆలో చించదగింది. వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా ముస్లిములు ఒక్కటై నిలబడ్డారు. నిజానికి పౌరసత్వ సవరణ చట్టం విషయంలోనూ ముస్లిముల్లో ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. వక్ఫ్ చట్టంపై మొత్తం ముస్లిం సముదాయం ఒక్కతాటిపై నిలబడడం బీజేపీని కుదిపేసిందని, ముస్లిముల్లో కులపరమైన విభేదాలు రాజేయ డానికి వేసిన ఎత్తుగడే ఈ నిర్ణయానికి కారణమని కొందరి అభిప్రాయం.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే, వక్ఫ్ చట్టం పస్మాందా ముస్లిములకు అంటే వెనుకబడిన ముస్లిములకు చాలా ఉపయోగకరమైందని బీజేపీ చెబుతూ వస్తోంది. కాని వక్ఫ్ చట్టంపై ముస్లిముల ప్రతిక్రియను బీజేపీ, సంఘ్ పరివార్ ఊహించలేదు. పస్మాందా, వెనుకబడిన ముస్లిములు అందరూ వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తారని వారు ఊహించలేకపోయారు.

> **అంతేకాదు పస్మాందా ముస్లిముల పట్ల బీజేపీ ప్రేమ అసలు రంగేమిటో కూడా ఆయన బట్టబయలు చేశారు. కాస్త ఆలోచిం చవలసిన విషయమేమిటంటే, గోరక్షా దళాల దాడుల్లో, మూక హత్యల్లో బాధితులైన వారిలో ఎంతమంది పస్మాందా ముస్లిము లున్నారు? బుల్డోజర్ న్యాయం పేరుతో కూల్చేసిన ఇళ్ళు దుకాణాలు పస్మాందా ముస్లిములవి కావా?**

గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో నడుస్తున్నవి మత రాజకీయాలే. మతం పేరుతో ఓట్లు రాబట్టుకోవడం తెలిసిన పార్టీ కులగణన చేస్తే బట్ జాయేంగేతో కట్ జాయేంగే, ఏక్ హైతో సేఫ్ హై వంటి నినాదాలు ఇచ్చింది. ఒక మతం పేరుతో అందరినీ తన వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేసింది. మరోవైపు వక్ఫ్ చట్టం మతం ప్రాతిపదికనే ముస్లిములందరినీ ఏకం చేసి నిరసన గళమెత్తేలా చేసింది. ఈ సమైక్యతను దెబ్బతీయాలంటే ముస్లి ముల్లో ఉన్న కులభేదాలను మరింత పెంచడం అవసరమనే ఎత్తుగడే ఈ నిర్ణయం వెనుక ఉందని కొందరి విశ్లేషణ.

గమనించవలసిన విషయమేమిటంటే, బీజేపీ మతరాజకీయా లను ఎదుర్కోడానికి రాహుల్ గాంధీ కూడా కులగణననే ఆయు ధంగా మలచుకున్నారు. అఖిలేష్ యాదవ్ PDA అన్నాడు. అంటే పిఛడా (వెనుకబడినవర్గాలు), దళిత్, యాదవ్ సమైక్యతకు పిలుపునిచ్చాడు. అంటే మతరాజకీయాలను ఎదిరించడానికి ప్రతిపక్షాలు ఏ వ్యూహం రచించాయో అదే వ్యూహంతో దెబ్బతీయడానికి, అంటే ముస్లిము ఓట్లలో కులప్రాతిపదికన కోత పెట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ముస్లిములు మతపరమైన సమస్యల్లో అది బాబరీ మస్జిద్ కానీవండి, వక్ఫ్ చట్టం కానీవండి ఒక్కటవుతున్నారు. కాని వారిలో కూడా కుల పరమైన విభేదాలున్నాయి. వాటిని రాజేస్తే సమాజంలో కొత్త చర్చకు తెరలేపవచ్చు.

ఈ ఆలోచనల వెనుక బీహార్ కులగణన ఫలితాల్లో తెలిసిన విషయాలు కూడా ఉన్నాయి. 2023లో బీహారు కులగణన జరిగింది. అందులో ముస్లిమేతర, ముస్లిం ఓబీసీలు అందరు కలిసి 63.1 శాతం ఉన్నారు. తెలంగాణ లెక్కలు కూడా దాదాపు ఇలాగే ఉన్నాయి. ముస్లిం, ముస్లిమేతర ఓబీసీలు 56.33 శాతం ఉన్నారు. ముస్లిం ఓబీసీలను 'బీసీ ఈ' జాబితా కింద చేర్చారు.

బీహారులో యాదవులు 14 శాతానికి మించి ఉన్నారు. అక్కడ ముస్లిములు 17 శాతానికి మించి ఉన్నారు. అయితే ఇది కులగణన కాబట్టి ముస్లిముల కులాలు కూడా లెక్కించారు.

సూత్రప్రాయంగా మాట్లాడుకుంటే హిందువుల మాదిరిగా కులాలు ఇస్లాంలో లేవు. కులాంతర వివాహాలు హిందువుల్లో ఇప్పుడు కూడా తక్కువే. ముస్లిముల్లో కూడా ఇలాంటి పరిస్థితి కొద్దోగొప్పో ఉంది. అయితే అన్నపానీయాల విషయంలో, సహపంక్తి భోజనం విషయంలో కులవివక్ష అనేది కనిపించదు. అందువల్లనే ఇస్లాంలో సైద్ధాంతికంగా కులాలు లేనే లేవని, ఆచరణలో కూడ కులవివక్ష లేదని చెప్పడం జరుగుతుంది. కాని కులాలను లెక్కించే విషయానికి వచ్చినప్పుడు కులం పేరు కూడా చెప్పక తప్పదు. ఏ సముదాయం ఏ స్థితిలో ఉందో తెలిసిపోతుంది కాబట్టి ముస్లిం నేతలు దీన్ని వ్యతిరేకిస్తారనే అంచనా కూడా దీని వెనుక ఉంది.

రాజకీయాల్లో కాని ఉన్నతపదవుల్లో కాని ఏ విధంగా సవర్ణ హిందువులే అధికసంఖ్యలో ఉన్నారో అదేవిధంగా ముస్లిముల్లో కూడా కొన్ని సముదాయాలే అధిక ప్రయోజనాలు పొందడం జరిగిందన్నది కూడా వాస్తవమే. ఈ లెక్కలు కూడా బయట పడతాయి.

బీహారు కులగణన లెక్కలు చూస్తే ఈ వ్యవహారం అర్థమవుతుంది. అక్కడ మొత్తం ముస్లిములు 17 శాతానికి మించి ఉన్నారు. ఇందులో 4.8 శాతం ఫార్వార్డ్ ముస్లిములు. ఇందులో 2.3 బ్యాక్ వర్డ్ ముస్లిములు, దాదాపు 10.5 శాతం అత్యంత వెనుకబడిన ముస్లిములున్నారు. అంటే మొత్తం ముస్లిముల్లో దాదాపు 13 శాతం వెనుకబడిన వారే, అంటే మోడీ గారు చెప్పే పస్మాందా ముస్లిములు. యావత్తు దేశంలో కూడా ఈ లెక్కలు ఇంచుమించు ఇలాగే ఉండవచ్చు. ఈ ముస్లిములను తనవైపు తిప్పుకోవడానికి కులగణన ఉపయోగపడుతుందనే ఎత్తుగడ ఈ నిర్ణయం వెనుక ఉంది. ముస్లిముల బుజ్జగింపు రాజకీయాలు నడిపిన కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం తర్వాత కేవలం ఫార్వార్డ్ ముస్లిములకే దోచిపెట్టిందని ప్రచారం చేయడం ద్వారా బ్యాక్ వర్డ్ ముస్లిములను తమవైపు తిప్పుకోవచ్చనే ఆలోచన దీని వెనుక ఉంది.

పంక్చర్ వాలా అని మోడీ చేసిన వ్యాఖ్య అనాలోచితంగా చేసింది కాదు. ముస్లిములందరు పంక్చర్లు వేసుకునేవారని చెప్పారని, ముస్లిముల్లో కూడా పెద్ద చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవాళ్ళు ఉన్నారని చెప్పి జవాబు చెప్పేశామని కొందరనుకున్నారు. కాని మోడీ చేసిన పంక్చర్ వాలా వ్యాఖ్య వెనుక పస్మాందా ముస్లిములను ఇలా అణిచేశారని చెప్పడం ఉంది. ఆ విధంగా వారిలో కులపరమైన ఆలోచనలను రేకెత్తించి, వారిని వేరు చేసి తనవైపు తిప్పుకునే ఎత్తుగడ ఉంది.

## ఈ ఎత్తుగడ ఫలిస్తుందా?

జమాఅతె ఇస్లామీ హింద్ వంటి అనేక సంస్థలు కులగణన నిర్ణయాన్ని స్వాగతించాయి. అంటే ముస్లిముల్లో ఎన్ని సముదాయాలున్నాయి? వారి పరిస్థితేమిటన్న లెక్కలు బయటకు వస్తే భయపడి వీళ్ళంతా గగ్గోలు చేస్తారనుకునే లెక్కలు తప్పాయి. మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ పస్మాందా ముస్లిములు ఎంత వెనుకబడి ఉన్నారో దీనివల్ల స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కులగణన ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. పస్మాందా ముస్లిముల స్థితిగతులేమిటి? పస్మాందా కాని ఫార్వార్డ్ ముస్లిముల స్థితిగతులేమిటి? ఇవన్నీ కులగణన జరిగితే స్పష్టంగా తెలుస్తాయని ఆయన అన్నాడు. తెలంగాణలో కులగణన జరిగింది. 56 శాతానికి పైబడి ఇక్కడ ఓబీసీలున్నారు.

> బీజేపీ మాటలు చేతల్లోని వైరుధ్యాన్ని ఇక్కడ స్పష్టంగా అందరూ గమనిస్తున్నారు. నిన్నటి వరకు పస్మాందా లేదా వెనుకబడిన ముస్లిములకు రిజర్వేషన్లను మతపరమైన రిజర్వేషన్లుగా ముద్ర వేసి తీవ్రంగా వ్యతిరేకించి గగ్గోలు చేసిన పార్టీ ఇప్పుడు పస్మాందా ముస్లిముల లెక్కలు తీస్తామంటుంది.

42 శాతం రిజర్వేషన్లు వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలని తీర్మానం కూడా చేశారు. తెలంగాణలో ముస్లిం వెనుకబడిన వర్గాలు 10.08 శాతం. కులగణన జరిగి రిజర్వేషన్ సదుపాయాలు కల్పించడానికి పూనుకున్నప్పుడు 50 శాతం పరిమితిని అధిగమించడం తప్పదని ఒవైసీ చెప్పారు. కులగణన జరిగితే ప్రభుత్వేతర రంగాల్లో కూడా ఓబీసీల పరిస్థితి ఏమిటో తెలుస్తుందని కూడా ఆయన చెప్పారు. 50 శాతం పరిమితిని అధిగమించడానికి పార్లమెంటు సభ్యులందరు మద్దతిస్తారని కూడా ఆయన చెప్పారు.

అంతేకాదు పస్మాందా ముస్లిముల పట్ల బీజేపీ ప్రేమ అసలు రంగేమిటో కూడా ఆయన బట్టబయలు చేశారు. కాస్త ఆలోచించవలసిన విషయమేమిటంటే, గోరక్షా దళాల దాడుల్లో, మూక హత్యల్లో బాధితులైన వారిలో ఎంతమంది పస్మాందా ముస్లిములున్నారు? బుల్డోజర్ న్యాయం పేరుతో కూల్చేసిన ఇళ్ళు దుకాణాలు పస్మాందా ముస్లిములవి కావా? దేశంలోని ముస్లిము జనాభాలో అత్యధిక శాతం పస్మాందా ముస్లిములే. నేడు మతతత్వ దాడులకు గురవుతున్న వారిలో కూడా ఎక్కువమంది వాళ్ళే. మోడీ గారి పస్మాందా ప్రేమను వాళ్ళు అర్థం చేసుకోలేరా?

బ్రిటీషు కాలంలో 19వ శతాబ్దంలో జనాభా లెక్కలు తీస్తున్నప్పుడు ముస్లిములను ప్రత్యేకంగా ఒక మత సముదాయంగా లెక్కించేవారు. 1931లో చివరి సారిగా హిందు కులాలను లెక్కించడం జరిగింది. అప్పుడు ముస్లిములను కులాల వారీగా లెక్కించలేదు. తెలంగాణ కులగణనలో దాదాపు 80 శాతం ముస్లిములు ఓబీసీలే అని తేలింది.

ఇప్పుడు పస్మాందా ముస్లిములపై ప్రేమ ఒలకబోస్తున్న బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో 4 శాతం ముస్లిం రిజర్వేషన్లపై ఎందుకు గగ్గోలు చేసింది? ఈ 4 శాతం రిజర్వేషన్లు మతం ప్రాతిపదికన ఇవ్వలేదు. ఓబీసీ జాబితా ప్రాతిపదికన ఇచ్చారు. తెలంగాణలో జరిగిన కులగణన వల్ల తెలిసిన లెక్కలు చాలా ముఖ్యమైనవి. ముస్లిం వెనుకబడిన కులాలకు ఇక్కడ లభిస్తున్న రిజర్వేషన్లు కేవలం 4 శాతం మాత్రమే. నిజానికి జనాభాలో వారు 10.08 శాతం ఉన్నారు. ఈ లెక్కల వల్ల వారి రిజర్వేషన్లు పెంచడం అవసరమని తెలిసింది. అంతేకాదు, కులగణన ఇప్పుడు జాతీయ స్థాయిలో జరిగేదయితే, ముస్లిముల్లో కూడా కులాలను లెక్కించేదయితే, కులాల వారీగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వడం కూడా జరగాలి. అలాంటప్పుడు ముస్లిం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో కేసుల విషయమేమిటి?

బీజేపీ మాటలు చేతల్లోని వైరుధ్యాన్ని ఇక్కడ స్పష్టంగా అందరూ గమనిస్తున్నారు. నిన్నటి వరకు పస్మాందా లేదా వెనుకబడిన ముస్లిములకు రిజర్వేషన్లను మతపరమైన రిజర్వేషన్లుగా ముద్ర వేసి తీవ్రంగా వ్యతిరేకించి గగ్గోలు చేసిన పార్టీ ఇప్పుడు పస్మాందా ముస్లిముల లెక్కలు తీస్తామంటుంది. లెక్కలు తీసిన తర్వాత మిగిలిన వెనుకబడిన వర్గాలతో పాటు, ఎవరెంత మంది ఉన్నారో అంత వాటా ఇవ్వడం కూడా జరగాలి. ఇది ముస్లిములకు ప్రయోజనకరమైన పరిణామమే.

నిజానికి వి.పి.సింగ్ ప్రభుత్వం 90వ దశకంలో మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయడానికి తీసుకున్న నిర్ణయం వెనుక కూడా మతరాజకీయాలను అడ్డుకునే ఆలోచనే ఉంది. 27 శాతం రిజర్వేషన్లను వెనుకబడిన వర్గాలకు ప్రకటించింది. మండల్ కమిషన్ కొన్ని ముస్లిం ఓబీసీ సముదాయాలకు కూడా రిజర్వేషన్లు సిఫారసు చేసినప్పటికీ ముస్లిం ఓబీసీలకు రిజర్వేషన్లు నిరాకరించారు. 2011లో యుపియే ప్రభుత్వం కులగణన చేయించింది కాని డాటాను ప్రకటించలేదు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ డాటాను పూర్తిగా అటకెక్కించింది. ఆ తర్వాత మోడీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించింది. ఈ రిజర్వేషన్లు కూడా సూత్రప్రాయంగా మతపరమైనవి కావు, కాబట్టి ఫార్వార్డ్ కులాలకు చెందిన ముస్లిములకు కూడా ఇందులో రిజర్వేషన్లు తీసుకునే హక్కు ఉంటుంది. ఆ విధంగా ఆ నిర్ణయం కూడా ముస్లిములకు లాభసాటే అని చెప్పాలి.

మోడీ ప్రభుత్వం కులగణన చేయించడానికి, ముఖ్యంగా ముస్లిముల్లో కులాలను లెక్కించడానికి వెనుక రాజకీయ లెక్కలు ఎలా ఉన్నప్పటికీ, దీనివల్ల ముస్లిములకు విస్తృతస్థాయిలో ప్రయోజనాలున్నాయి. ఎందుకంటే దేశంలోని ముస్లిముల్లో అత్యధికశాతం వెనుకబడిన వర్గాలకు చెందినవారే. వారికి రిజర్వేషన్లు లభించే మార్గాలు తెరుచుకుంటున్నాయి. కోర్టు కేసుల సమస్య లేకుండా రిజర్వేషన్లు వచ్చే అవకాశాలు మెరుగయ్యాయి. తెలంగాణలో 4 శాతం రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్‌కు కూడా బలం చేకూరింది. కనీసం 10 శాతానికి పెంచాలన్న డిమాండ్ రావడం నేటి అవసరం.

కులగణన జరుగుతున్నప్పుడు సాధారణంగా అనేక భయాలను ప్రచారంలో పెట్టి కులగణన లక్ష్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తారు. స్కాలర్ షిప్పులు ఆపేస్తారని (నిజానికి ముస్లిములకు అనేక స్కాలర్ షిప్పులు ఇప్పుడు ఇవ్వడం లేదు), రేషన్ కార్డులు రద్దు చేస్తారని ఇలా అనేక అపోహలు ప్రచారంలో పెట్టి సరయిన వివరాలు చెప్పడానికి సంకోచించే వాతావరణం సృష్టిస్తుంటారు కొందరు. కాని కులగణన సర్వేలో సరయిన సమాచారం అందించడం చాలా అవసరం. ఈ సర్వే దేశంలో ముస్లిముల స్థితిగతులను తెలుసుకునే అద్భుతమైన అవకాశం. రాజకీయ నేతలు, మత పెద్దలు ఈ అవగాహన పెంచే ప్రయత్నం చేయాలి. రిజర్వేషన్ల ప్రయోజనాలు ముస్లిములందరికీ కాకపోయినా ముస్లిముల్లో వెనుకబడిన వర్గాలకు లభించే అవకాశం ఉన్నప్పుడు దానికి అందరూ మద్దతివ్వాలి. అలాంటి మద్దతు ముస్లిం సంస్థల నుంచి ముస్లిం రాజకీయ నేతల నుంచి రావడం స్వాగతించదగిన పరిణామం. ✤



ఎస్.ఎమ్. మలిక్

# ముస్లిమ్ సముదాయం శీల స్వభావాల నిర్మాణం

**దివ్య కుర్‌ఆన్‌లో** ముస్లిములను సంబోధించిన ప్రతి సందర్భంలో వారిని ఒక సముదాయంగానే సంబోధించడం జరిగింది. అదీ వారి విశ్వాసాన్ని గుర్తు చేస్తూ, ముస్లిములను ఒక సముదాయంగా, ఒక సైద్ధాంతిక సముదాయంగా గుర్తు చేస్తూ మరీ సంబోధించడం జరిగింది. మచ్చుకు కొన్ని వచనాలు ఈ సందర్భంలో పరిశీలించడం సమంజసంగా ఉంటుంది.

> **విశ్వసించిన వారలారా! దైవానికి భయపడండి, భయపడవలసిన రీతిలో. ఇంకా మీకు మృత్యువు ఆసన్నమయినా మీరు ముస్లిములయి ఉన్న స్థితిలోనే రావాలి.** *(ఆలి ఇమ్రాన్ 3 : 102)*

> **మీరంతా కలసి దైవం త్రాటిని (దైవ ధర్మాన్ని) పటిష్టంగా పట్టుకోండి, ఇంకా విచ్ఛిన్నతకు లోనవకండి.** *(ఆలి ఇమ్రాన్ 3: 103)*

> **ఇదే విధంగా మేము మిమ్మల్ని ఒక "మధ్యస్థ సముదాయంగా" రూపొందించాము, మీరు ప్రపంచ ప్రజల కొరకు (దైవ ధర్మానికి) సాక్షులుగా నిలువాలనీను, ప్రవక్త మీ కొరకు సాక్షి కాగలగాలనీను.** *(అల్ బకర 2: 143)*

> **విశ్వసించిన వారలారా! మీరు సంపూర్ణంగా ఇస్లామ్‌లోకి వచ్చేయండి, షైతాన్ అడుగులకు మడుగులొత్తకండి, వాడు మీకు బద్ధ శత్రువు.** *(అల్ బకర 2: 208)*

> **విశ్వసించిన వారలారా! సహనం వహించండి, మిథ్యావాదులకు ప్రతిగా శౌర్యం కనబరచండి, సత్య సేవకొరకు నడుం బిగించండి, ఇంకా దైవానికి భయపడుతూ మెలగండి, అప్పుడే మీరు సాఫల్యం పొందగలరని ఆశించ వీలుంది.** *(ఆలి ఇమ్రాన్ 3: 200)*

## దైవం పట్ల జాగరూకత

ఇక్కడ ఉదాహరించిన తొలి వచనంలో "దైవానికి భయపడవలసిన రీతిలో భయపడా"లని బోధించడం జరిగింది. అనువాదంలో "దైవ భయం"అని ప్రయోగించిన చోట మూలంలో ప్రయోగించిన పదం **'తక్వ'** అన్నది. అది ఒకానొక మానసిక స్థితికి నిర్వచనం. అందులో మనిషి తన సృష్టికర్త, దైవం పట్ల, ఆయన మానవుని సదాచరణలకు బహూకరణలు ప్రదానం చేసేవాడు, మరి దురాచరణలకు శిక్ష విధించేవాడు అన్న జాగరూకతతో ఆయన పట్ల విధేయత కనబరచడం అనే భావం ఉంది. ఆ స్థితిలో మనిషికి చెడుల ఎడల అసహ్య భావం, మంచి ఎడల ప్రేమ భావం ఏర్పడుతుంది. మంచి విషయాలన్నీ మక్కువ గలవిగా, చెడుగులన్నీ చీదరయినవిగా అనిపిస్తాయి.

రెండవ వచనంలో అందరూ కలసికట్టుగా ధార్మిక నియమాలను పటిష్టంగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేర్పాటుకు లోనవరాదని హెచ్చరించడం జరిగింది. ఈ వచనం ముస్లిములను వారు ఎక్కడ ఉన్నా సమైక్యంగా, కలసికట్టుగా ఒకే నాయకత్వం ఆధారంగా సాముదాయిక జీవితం గడపాలన్న విధ్యుక్త బాధ్యతను గుర్తు చేస్తోంది. ఆ సమైక్యత ఒక లక్ష్యంతో, ఒకే ధ్యేయం కొరకు ఏర్పడాలన్న విషయం ఓ మహత్తర సముదాయానికి వేరుగా చెప్పకపోయినా అర్థం చేసుకోవచ్చు.

## ముస్లిముల కర్తవ్యం

ఆ తరువాత మూడవ వచనంలో అతి ముఖ్యమయిన బాధ్యతను ముస్లిములకు అప్పగించడం జరిగింది. ఇందులో ముస్లిమ్

సముదాయాన్ని ప్రత్యేకంగా 'మధ్యస్థ సముదాయం'గా ఏర్పరచి నట్లు ప్రకటించి ఆ బాధ్యత నప్పగించడం జరిగింది. ప్రవక్త మహనీయులు ఇస్లామ్‌ను ఆచరణలో పెట్టి ముస్లిముల కొరకు సాక్షిగా నిలిచిన విధంగానే ముస్లిములు సయితం సాధారణ జనావళి సమక్షంలో దైవ ధర్మాన్ని ఆచరణ రూపంలో అమలు పరచి దానికి ప్రత్యక్ష సాక్షులయి నిలువాలని ఆదేశించడం జరిగింది.

ముస్లిములు సముదాయ రూపంలో ఎప్పుడు ఏర్పడినా, ఎక్కడ మనగలిగినా, ఈ బాధ్యతను తప్పనిసరిగా నిర్వర్తించవలసి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ముస్లిమ్ సముదాయాన్ని మొత్తాన్ని సంబోధించి ఆదేశించడం జరిగింది. ఏదో ఒక కాలానికి లేదా ఏదో ఒక ప్రాంతానికి చెందిన ముస్లిముల్ని మాత్రమే సంబోధించ లేదు. అంటే ఏ ఏ సందర్భంలో ఇస్లామ్ సందేశం ఏ ఏ ప్రజలకు అందలేదని స్ఫురిస్తుందో అప్పుడల్లా ముస్లిములు వ్యక్తిగతం గానూ సామూహికంగానూ, మాటల ద్వారానూ చేతల ద్వారానూ దైవ ధర్మాన్ని వారెల్లరికీ అందజేయడం వారి కర్తవ్యం.

ఆ పైన, నాల్గవ వచనంలో సంపూర్ణంగా ఇస్లామ్‌లోకి ప్రవేశించ వలసిందని ముస్లిములను కోరడం జరిగింది. అంటే మనసా వాచా కర్మణా ప్రవేశించడం అని భావం. ఇంకా జీవన రంగా లన్నింటిలో, పూజా పురస్కారాలే కాదు, జీవిక సంపాదన మొదలుకుని, కుటుంబ వ్యవహారాలు, సామాజిక విషయాలు, రాజకీయ కార్యకలాపాలు- సర్వం ఇస్లామ్ ఆదేశాల కనుగుణంగా జరగాలి. సంపూర్ణంగా ప్రవేశించక పోయినట్లయితే షైతాన్ వివిధ దారుల నుంచి ప్రవేశించగలడని, జనులు షైతాన్‌కు లోబడి పోతారని, వాడు మానవులకు విచ్చలవిడిగానే నష్టపరుస్తాడని, వాడి వాతన పడితే వాడిని అనుసరించిన వారవుతారని, అందు వల్ల వాడిని తప్పించుకు మనగలగాలని హెచ్చరించడం జరిగింది.

## సముదాయం సుశిక్షణ

ఇక అయిదవ వచనంలో ఇస్లామ్ ధార్మిక మార్గంలో ముస్లిమ్ సముదాయం అనుసరించవలసిన విధానాన్ని సంక్షిప్త రూపంలో ప్రస్తుత పరచడం జరిగింది. ఈ దైవ వచనంలో నాలుగు ఉపదేశాలు ప్రోక్తమయినవి.

- సహనం వహించండి.
- మిథ్యకు ఎదురుగా ధైర్యసాహసాలు ప్రదర్శించండి.
- సత్య సేవ కొరకు నడుం బిగించండి.
- దైవానికి భయపడుతూ మెలగండి.

ఇవి నాలుగు నిర్దేశాలు. ఇస్లామ్ మార్గాన్ని అనుసరించ దలచిన వారికి ఆ ధార్మిక మార్గం సులభమయినది కాజాలదు. ఇబ్బం దులు తప్పకుండా ఎదురవుతాయి. అటువంటి సందర్భాల్లో సహనం వహించాలని నిర్దేశన. ధర్మాన్ని వ్యక్తిగత స్థాయిలో అమలుపరచడంలో కూడా మనిషి అంతరంగ విరోధ భావాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది, దాన్ని జయించాలి. అది ఎంతో సహనంతో కూడిన సంఘర్షణ.

ఆ తరువాత సామూహిక రంగంలో ఇస్లామ్‌ను అమలు పరచ గోరిన ప్రతి సందర్భంలోనూ ముస్లిములు మిథ్యావాదాన్నీ, మిథ్యా వాదుల్నీ, మిథ్యా వ్యవస్థను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఆ మిథ్యావాదులు తమవారు కావచ్చు పరులూ కావచ్చు. వారు పెట్టే అడ్డంకుల్ని సహన స్థయిర్యాలతో ఎదుర్కొనే ధైర్య సాహ సాలు సముదాయంలో పుష్కలంగా ఉండాలి. ఇంకా అటువంటి సందర్భాల్లో సత్యాన్ని, ధర్మాన్ని రక్షించేందుకు సత్యవాదులు, ధర్మ పథ గాములు పరస్పరం చెయ్యీ చెయ్యి కలపడంతోపాటు అందరూ కలసి నడుం బిగించి ప్రతీప శక్తుల్ని ఎదురొడ్డడం కూడా ఎంతో అవసరం. కాబట్టి ముస్లిములు ఇస్లామ్‌ని వ్యక్తిగత స్థాయిలోనూ సామూహిక స్థాయిలోనూ రక్షించుకునేందుకు పాటుపడటం అనివార్యమయిపోతుంది.

ఈ సందర్భాలన్నింటిలో మనిషి దైవాన్ని మరచిపోరాదు, అనునిత్యం ఆయన స్ఫురణ నీడలా మనిషిని వెన్నంటి ఉండాలి, ఆయన కారుణ్యఛాయ వలే సముదాయాన్ని కాపాడుతూ ఉండాలి. ఈ ఉద్దేశంతో ఇస్లామ్ అనుయాయులకు అందజేయ బడిన బోధనలన్నింటిలో **"ఇత్తకిల్లాహ్"** (దైవానికి భయపడు) అన్న భావం, వివిధ పదబంధాల్లో సదా దైవాన్ని గుర్తు చేస్తూ ఉంటుంది. దీని మూల పదమయిన **"తక్వ"** ఇస్లామ్ గరిపే సుశిక్ష ణలో జీవనాడి వంటిది. **"తక్వ"** అన్న మాటకు భావం ఇక్కడ తొలి వచనం వివరణలో మనం గమనించాము. దాన్ని సదా నెమరు వేసుకుంటూ ఉండాలి.

## ఇస్లామ్ ఉద్దేశం

యాదృచ్ఛికంగా మేము ఎన్నుకున్న వచనాలు, వాటి వివరాలను గమనిస్తే సర్వ సాధారణంగా ఇస్లామ్ దృష్టిలో దాని అను యాయుల సుశిక్షణ ఎంత ముఖ్యమో అవగతమవుతోంది. వాస్తవానికి కేవలం ధర్మాన్ని స్వీకరించడం ముఖ్యం కాదు, దాన్ని, అది కోరే విధంగా అనుసరించడమే ప్రముఖమయినది. దివ్య కుర్‌ఆన్ ఈ విషయాన్నే పలు మార్లు చాటుతుంది కూడా.

మహనీయ ఇబ్రాహీమ్ (అ), మహనీయ ఇస్మాయీల్ (అ)తో కలసి కాబా పవిత్ర గృహం గోడల్ని లేపుతూ చేసిన దుఆ (ప్రార్థన) ను గమనించండి,

> **ఇంకా ఓ మా ప్రభూ! వీరిలో, స్వయంగా వీరి జాతి నుంచే ఓ ప్రవక్తను ఆవిర్భవింపజెయ్యి, అతను వీరికి నీ వచనాలను వినిపించేవాడు, వీరికి గ్రంథం, విజ్ఞత బోధనలు గరిపే వాడు, ఇంకా వీరి జీవితాలను చక్కదిద్దేవాడయి ఉండాలి.**

***(అల్ బకర 2: 129)***

ఇంకా ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స)ను గురించి ఇచ్చిన శుభవార్తలో తెలిపిన వివరాలు కూడా గమనార్హమయినవే,

**నేను మీ మధ్య, స్వయంగా మీలో నుంచే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాను. అతను మీకు నా వచనాలను వినిపిస్తాడు, మీ జీవితాలను చక్కదిద్దుతాడు, మీకు గ్రంథం, విజ్ఞతాబోధనలు చేస్తాడు, మీరు ఎరుగని విషయాలను మీకు బోధిస్తాడు.**

***(అల్ బకర 2: 151)***

**ఆయనే ఉమ్మీలలో ఒక సందేశహరుణ్ణి స్వయంగా వారిలో నుంచే ఆవిర్భవింపజేశాడు. అతను ఆయన వచనాలను వారికి వినిపిస్తాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు, వారికి గ్రంథాన్నీ, ఔచితీ విజ్ఞతల్ని బోధిస్తాడు. వాస్తవానికి ఇంతఃపూర్వం వారు స్పష్టమయిన మార్గవిహీనతకు లోనయి ఉండేవారు.**

***(అల్ జుముఅ 62: 2)***

## సరికొత్త సంస్కృతి

ఈ వచనాలను బట్టి ప్రవక్తల ఆవిర్భావానికి ఉద్దేశం అయినా లేదా తమ అనుయాయుల పట్ల వారి బాధ్యత అయినా ఏమిటంటే వారికి దైవ వచనాలను వినిపించడం, వారి జీవితాలను చక్కదిద్ది సంస్కరించడం, వారికి గ్రంథ జ్ఞానం తోపాటు విజ్ఞతను ప్రదానం చెయ్యడం. ఇదే కార్యక్రమం సమిష్టిగా నిర్వహించినప్పుడు అది సమాజ సముద్ధరణగా రూపొందుతుంది. ఇస్లామ్ ద్వారా మనుషులు వ్యక్తిగతంగానూ సామూహికంగానూ సంస్కరించబడతారు. అంటే ఓ కొత్త సంస్కృతీ నాగరికతలు ప్రాణం పోసుకుంటాయి.

ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడంతో సరిపోదు, ఇస్లామ్ దాన్ని అవలంబించే వారిని ఇట్టే వదలదు, సుశిక్షణ గరిపి వారిని తీర్చిదిద్దాలని కోరుతుంది. ఒకరు ఇస్లామ్ స్వీకరించడం కన్నా వారి శిక్షణ పట్ల ఇస్లామ్ అధికంగా శ్రద్ధ వహిస్తుంది. ముస్లిములను వ్యక్తిగతంగా మాత్రమే కాక సామూహికంగా కూడా శిక్షణ గరపవలసి ఉంటుందని గట్టిగా చెబుతుంది ఇస్లామ్. అయితే వారు తమ జీవితాలను చక్క దిద్దుకుని తమ ఇహపరాల సాఫల్యం పట్ల శ్రద్ధ చూపడమే కాక తోటి మానవ సోదరుల ఇహపరాలను సయితం మెరుగు పరిచేందుకు కృషి చేయాలని బోధిస్తుంది కుర్ఆన్.

## సమృద్ధ పరచడం

మనం పైన గమనించిన వచనాలలో ప్రపంచ ముస్లిములను మధ్యస్థ సముదాయంగా రూపొందించి సకల మానవాళి కొరకు దైవ ధర్మానికి సాక్షులుగా నిలువాలని కర్తవ్యం నిర్ధారించింది దివ్యకుర్ఆన్. దీన్ని బట్టి భారతీయ ముస్లిములు ఈ దేశంలో ఇస్లామ్‌కు ప్రత్యక్ష సాక్షులుగా నిలువాలి. ఇస్లామ్ సందేశాన్ని దేశవాసులకు అందజేయడమే ధ్యేయంగా ఈ దేశంలో ముస్లిములు జీవించవలసి ఉంటుంది. ఇది దైవం వారి కొరకు నిర్దేశించిన కర్తవ్యం.

చక్కదిద్దడం లేదా సంస్కరించడం అని ప్రయోగించిన దాని అరబీ పదం **'తజ్కియ'** అన్నది. తజ్కియ అంటే పరిశుద్ధ పరచడం, సమృద్ధ పరచడం అని అర్థం. అంటే దైవ ప్రవక్త బోధనల్లో ఆయన అనుయాయుల ఆధ్యాత్మిక పరిశుద్ధతకు తోడుగా ఆధ్యాత్మిక వికాసానికీ మానసిక పెరుగుదలకూ అవకాశం ఉంటుందని భావం. మానవ సుశిక్షణకు సంబంధించిన ఈ సకల విషయాలు ఏకత్రమయి అన్నీ సక్రమంగా ప్రాప్తమయినప్పుడే సమగ్రమయిన సుశిక్షణ జరిగినట్లు.

## మానసిక స్థితి

మనిషికి ప్రవక్త బోధనల వల్ల ఈ ప్రయోజనాలన్నీ ఒనగూడాలంటే మనిషి ఆంతర్యం సదా జాగరూకత కలిగి, అందులో దైవ విధేయతా భావం తొణకిసలాడాలి. ఆంతర్యం సకల భావనాత్మక మాలిన్యాలు, అహంభావం, దుష్ట చింతనలు, బహుదైవ భావనలు, నిషిద్ధ విషయాల నుంచి పరిశుద్ధమయి నిగనిగలాడాలి, అప్పుడే తనలోని, జగతిలోని దైవిక చిహ్నాల ద్వారా మనిషి ప్రభావితుడయి ఆధ్యాత్మిక శుభాలన్నింటికీ అర్హుడవుతాడు.

ఒక హదీసులో ప్రవక్త(స) ఇలా నుడివారు,

మానవ శరీరంలో ఓ మాంసం ముద్ద ఉంది, అది సవ్యంగా ఉంటే సర్వం సవ్యంగా ఉంటుంది. ఆ మాంసం ముద్ద 'గుండె.' అంటే హృదయం.

మానసిక సవ్యత ఎంత ముఖ్యమో దీన్ని బట్టి బోధపడుతోంది. మనిషి కొన్ని ఆరాధనలు ఆచరించి, కొన్ని దానధర్మాలు పాటించి, కొన్ని ధార్మిక సేవలొనర్చి తానేమేమో సాధించగలిగానని సంబరపడతాడు, అప్పుడే తప్పులో పడిపోతాడు. అటువంటి స్వోత్కర్షకు లోనవడం మానవుని ఆధ్యాత్మిక పతనానికి తొలి మెట్టు. ఇటువంటి వినాశ హేతువులకు దూరంగా ఉండేలా మానసిక పరిశుద్ధతను సదా పరిశీలిస్తూ పరిరక్షిస్తూ ఉండటం అత్యంత ఆవశ్యకం.

దైవం మనల్ని అందరినీ అటువంటి దురవస్థ నుంచి కాపాడు గాక!

**వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం**

సహజీవన భావనల పావురాయి

**గీటురాయి**

వారపత్రిక




- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

**ఇస్లామ్ కేవలం ఒక మతం మాత్రమే కాదు, అది సంపూర్ణ జీవన విధానమైన ధర్మం.** మానవాళి కోసం అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా పంపిన ధర్మం. రాజకీయాలకు సంబంధించి కూడా ఇస్లాం సంపూర్ణ మార్గదర్శనం చేస్తుంది. ఇస్లాం ప్రతిపాదించే వ్యవస్థ ప్రాథమిక సూత్రం ఏమిటంటే, సృష్టికర్త నిర్దేశించిన చట్టాలు మాత్రమే మానవుల వ్యక్తిగత, సామూహిక జీవితాలలో అమల వ్వాలి. ఈ విశ్వంలో సృష్టికర్త నిర్దేశించిన సూత్రాలు ఎలా అమలవుతున్నాయో అదేవిధంగా మానవుల సామూహిక జీవితంలో అల్లాహ్ నిర్దేశించిన శాసనాలే అమలవ్వాలి. విశ్వంలో భౌతికచట్టాలు అమలవుతున్నాయి. ఉదాహరణకు గురుత్వాకర్షణ. దీనివల్ల ప్రతిదీ భూమిపై పడుతుంది. అదేవిధంగా గతిశాస్త్ర నియమాలు, దీని ప్రకారం వస్తువులు చలనస్థితిలో లేదా నిశ్చల స్థితిలో ఉంటాయి. ఈ భౌతిక సూత్రాలు మార్పులేనివి. అన్ని చోట్ల, అన్నింటి విషయంలో సమానంగా పనిచేస్తాయి. దైవం నిర్దేశించిన సామాజిక శాసనాలంటే, మానవ జీవితం కోసం, మానవ సమాజం శ్రేయస్సు కోసం, పరలోక సాఫల్యం కోసం అల్లాహ్ ప్రసాదించిన చట్టాలు. భౌతిక సూత్రాలు లేదా నియమాలను ఉల్లంఘిస్తే వాటి పరిణామాలు వెంటనే కనిపిస్తాయి. ఉదాహరణకు ఎవరైనా ఎత్తయిన ప్రదేశం నుంచి దూకితే ధానికి ఫలితం వెంటనే కనిపిస్తుంది. కాని ఈ సామాజిక చట్టాలను ఉల్లంఘించిన ఫలితాలు అలా కనిపించవు. ఉదాహరణకు ఎవరైనా అబద్ధం చెప్పి అక్రమంగా ప్రయోజనాలు పొందితే, దాని ఫలితాలు తక్షణమే కనిపించవు. నైతిక ప్రపంచంలో శాసనోల్లంఘనానికి పాల్పడితే ఆ ఫలితాలు ప్రకటితమయ్యే మరొక ప్రపంచాన్ని అల్లాహ్ సృష్టించాడు, దానిని పరలోకం అంటారు.

అల్లాహ్ ఈ ప్రపంచాన్ని పరీక్ష కోసం సృష్టించాడు. అందువల్ల సామాజిక శాసనాలను పాటించే విషయంలో మనిషికి పూర్తి స్వేచ్ఛ లభించింది. అంటే ఇష్టమైతే అల్లాహ్ పట్ల విధేయత చూపవచ్చు లేదా చూపకపోవచ్చు. మనుషుల సామూహిక జీవితం విషయంలో కూడా అల్లాహ్ ఈ స్వేచ్ఛను ఇచ్చాడు. సమాజం ఇష్టమైతే అల్లాహ్ నిర్దేశించిన చట్టం ప్రకారం రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు లేదా ప్రజల ఇష్టానుసారం నడుచుకోవచ్చు లేదా నియంత ఇష్టానుసారం జరగవచ్చు.

## ఇస్లామీయ రాజకీయాల ప్రాథమిక సూత్రం

ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ పునాదులు దివ్యఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) సంప్రదాయాలు, సన్మార్గగాములైన ఖలీఫాల పద్ధతులు. ఇస్లామీయ రాజకీయవ్యవస్థ ముఖ్య లక్ష్యం- న్యాయం, సమానత్వం, పారదర్శకత కలిగిన సమాజాన్ని స్థాపించడం. అలాంటి సమాజంలో మనిషికి దేవుని ప్రసన్నత పొందేలా జీవించడం సులభమవుతుంది. ఇస్లామీయ రాజకీయ వ్యవస్థకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన మూలసూత్రాలు క్రింద చూద్దాం-

**1) ప్రభుత్వాధికారం ఒక అమానతు** : ఇస్లామీయ రాజకీయ వ్యవస్థలో పాలనాధికారాన్ని ఒక అమానతుగా అంటే దేవుడు అప్పగించిన బాధ్యతగా భావించడం జరుగుతుంది. ప్రజల సంక్షేమం, న్యాయం, ధర్మాల పరిరక్షణ బాధ్యత ఖలీఫా లేదా పాలకుడిపై ఉంటుంది. ప్రజలు పాలకుడి సంరక్షణలో ఉంటారు. వారి గురించి పాలకుడు అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. ఇది ఒక హోదా కాదు, పెద్ద బాధ్యత.

**2) సలహా సంప్రతింపుల వ్యవస్థ** : ఇస్లామీయ ప్రభుత్వం సలహా మండలిపై ఆధారపడి పనిచేస్తుంది. ''పరస్పర సంప్రదింపులతో వారి వ్యవహారాలు నడుస్తాయి'' (షూరా: 38). ఇస్లామీయ రాజకీయాలలో నిర్ణయాలు సలహా సంప్రదింపుల ద్వారా తీసుకోవడం జరుగుతుంది. అర్థం ఏమిటంటే, ప్రజలు ఎన్నుకున్న సభ్యులతో కూడిన ఒక పార్లమెంటు ఏర్పడాలి. ఆ సభ్యులు తమ విజ్ఞతా వివేచనలతో సలహా సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ సలహామండలిలో మెజారిటీ అభిప్రాయం ప్రకారం చట్టాలు చేయాలి. సలహామండలి అనే ఈ భావన 1450 సంవత్సరాల క్రితమే, అంటే సలహా సంప్రదింపుల గురించి ఆలోచన కూడా లేని కాలంలో, క్రూరమైన రాచరిక వ్యవస్థ పనిచేస్తున్నప్పుడు, రాజుగారి మతం తప్ప మరో మతం అవలంబించే అవకాశమే పాలితులకు లేని కాలంలో ఈ సలహాసంప్రదింపుల భావనను రాజకీయాల్లో ప్రవేశపెట్టడం జరిగింది.

**3. శాసనాలకు దివ్యఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాలే పునాదులు** : సలహా మండలి నిర్ణయాల ద్వారా చట్టాలు చేయడమంటే అర్థం మెజారిటీ అభిప్రాయానికి అనుగుణంగా ఇష్టమైన చట్టాలు చేసే స్వేచ్ఛ కాదు. చాలా దేశాలలో అమలులో ఉన్న ప్రజాస్వామ్యం ఇదే. కాని ఇస్లామీయ ప్రజాస్వామ్యం ప్రకారం అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగా చట్టాలు చేయడం కుదరదు. చట్టాలు చేయడం అన్నది దివ్య ఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాల పరిధిలోనే

**ఇస్లామీయ ప్రభుత్వం సలహా మండలిపై ఆధారపడి పనిచేస్తుంది. "పరస్పర సంప్రదింపులతో వారి వ్యవహారాలు నడుస్తాయి" (షూరా: 38). ఇస్లామీయ రాజకీయాలలో నిర్ణయాలు సలహా సంప్రదింపుల ద్వారా తీసుకోవడం జరుగుతుంది. అర్థం ఏమిటంటే, ప్రజలు ఎన్నుకున్న సభ్యులతో కూడిన ఒక పార్లమెంటు ఏర్పడాలి. ఈ సభ్యులు తమ విజ్ఞతా వివేచనలతో సలహా సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ సలహామండలిలో మెజారిటీ అభిప్రాయం ప్రకారం చట్టాలు చేయాలి. సలహామండలి అనే ఈ భావన 1450 సంవత్సరాల క్రితమే, అంటే సలహాసంప్రదింపుల గురించి ఆలోచన కూడా లేని కాలంలో, క్రూరమైన రాచరిక వ్యవస్థ పనిచేస్తున్నప్పుడు, రాజుగారి మతం తప్ప మరో మతం అవలంబించే అవకాశమే పాలితులకు లేని కాలంలో ఈ సలహా సంప్రదింపుల భావనను రాజకీయాల్లో ప్రవేశపెట్టడం జరిగింది.**

ఉండాలి. అంటే చట్టం దేవునిదే, చట్టాన్ని అమలు చేసేవారు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడతారు. ఇజ్తెహాదీ (శాసనాన్వయ) స్వభావం కలిగిన విషయాలలో, దివ్యఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాల వెలుగులో ఇజ్తెహాద్ ద్వారా నిర్ధయాలు తీసుకోవడం జరుగుతుంది.

**4) న్యాయం** : సమన్యాయ స్థాపన అనేది ఇస్లామీయ ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం. అల్లాహ్ ఆదేశం: ''నిశ్చయంగా అల్లాహ్ న్యాయం చేయమని, మేలు చేయమని ఆదేశిస్తున్నాడు'' (అన్-నహ్ల్: 90). ప్రభుత్వం పౌరులందరి పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. సమానంగా న్యాయం చేయాలి. ప్రజల సంక్షేమాన్ని కోరుతూ మరీ వారికి మేలు చేయాలి. అప్పటి ఖలీఫా కూడా సాధారణ వ్యక్తి మాదిరిగానే న్యాయస్థానం ముందు హాజరయ్యేవారు. న్యాయస్థానం దృష్టిలో ఒక పాలకుడికి కూడా ప్రత్యేక

స్థాయి ఏదీ ఉండేది కాదు. కానీ ఖిలాఫత్ రాచరికంగా మారిన తర్వాత ఖలీఫా నియంత అయిపోయాడు. నేతలు చట్టానికి అతీతులైపోయారు. న్యాయవ్యవస్థ నియంతల ఇంటి బానిసగా మారింది. ఎవరినైనా హతమార్చేవారు. పాలకుడిని విమర్శించే అధికారం ఎవరికీ లేదు. విమర్శించే వ్యక్తి రాజద్రోహిగా పరిగణించబడేవాడు. మరొక కీలకమైన మార్పు ఏమిటంటే ప్రభుత్వ ఖజానాకు సంబంధించి పారదర్శకత లేకుండా పోయింది. మొత్తం ఖజానా రాజు వ్యక్తిగత ఆస్తిగా మారిపోయింది. ప్రభుత్వ ఖజానాలో జమ అయిన డబ్బు గురించి లెక్క అడిగే హక్కు ఎవరికీ ఉండేది కాదు. ఖిలాఫత్ రాచరికంగా మారిన తర్వాత ఇస్లామీయ ప్రభుత్వ విధానం పూర్తిగా మారిపోయింది. అప్పటి నుండి నేటి వరకు ప్రపంచం ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ ప్రయోజనాలను మరలా చూడలేకపోయింది. ఇస్లాం అనవసరంగా అపఖ్యాతి పాలైంది. ఇస్లామీయ రాజకీయవ్యవస్థ అమలైన అద్భుత దృశ్యాన్ని ప్రపంచం చూసి ఉన్నట్లయితే వెనువెంటనే ఇస్లాంను ఇష్టపడి ఉండేది.

**5. నిజాయితీ ప్రధానంగా నేతల ఎంపిక :** పదవులు హోదాలు విషయంలో ముఖ్యంగా రాజకీయ పదవుల విషయంలో నిజాయితీపరులైన వారికి, ఆ పదవికి అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని దివ్యఖుర్ఆన్ స్పష్టంగా నిర్దేశించింది. "నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు. అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చెప్పినప్పుడు న్యాయంతో తీర్పు తీర్చండి అని. నిశ్చయంగా అల్లాహ్ మీకు ఎంత మంచి ఉపదేశం చేస్తున్నాడు!....." (సూరా అన్-నిసా: 58). ఈ ఖుర్ఆన్ వాక్యంలో రెండు సూత్రాలున్నాయి. మొదటిది: ఇస్లామీయ రాజ్యంలో పాలకులను, ప్రభుత్వ అధికారులను ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉంది. రెండవది: నిజాయితీపరులు, సమర్థులైన వ్యక్తులను ఎన్నుకోవాలి. ఎవరైనా బలవంతంగా దేశాధినేతగా మారితే, అది చట్టవిరుద్ధమైన ప్రభుత్వం అవుతుంది. పాలకుడు కాని, ఇతర రాజకీయ ప్రతినిధులు కాని ఎన్నికల ప్రక్రియ ద్వారా తమ పదవులను పొందడం జరుగుతుంది. అంతేకాదు, ఇస్లామీయ రాజ్య వ్యవస్థ ప్రాథమిక సూత్రం ఏమిటంటే, ఎవరైనా ఏదైనా పదవి లేదా ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే, నిజాయితీ, సామర్థ్యం ప్రధానంగా మాత్రమే పదవులు ఇవ్వబడాలి. పదవుల కేటాయింపు, నియామకాల్లో ఎలాంటి పక్షపాతం, అన్యాయం ఉండరాదు. ఇవి ఉంటే సమాజంలో అణచివేత, అవినీతి చోటు చేసుకుంటాయి. వర్ణం, వర్గం, జాతి, భాష పక్షపాతాలు సంస్థల్లో కల్లోలానికి కారణమవుతాయి. ఆరోగ్యవంతమైన శరీరంలో ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు శరీరం మొత్తం దాని దుష్ప్రభావాలను అనుభవించిన మాదిరిగా సమాజం ప్రభావితమవుతుంది. అల్లాహ్ దృష్టిలో గౌరవప్రపత్తులు దైవంపట్ల భయభక్తులపై ఆధారపడి ఉంటాయి (అల్-హుజురాత్: 13). అంటే, అల్లాహ్‌కు ఎక్కువగా భయపడే వ్యక్తి తన అధికారాలను దుర్వినియోగం చేయడు. నిజాయితీ పరుల రెండు లక్షణాలను దివ్యఖుర్ఆన్ సూరా ఖసస్‌లోని 26వ వాక్యంలో ఇలా పేర్కొంది: "ఆ ఇద్దరు స్త్రీలలో ఒకరు తన తండ్రితో అన్నారు, 'నాన్నా! అతన్ని పనిలో పెట్టుకోండి. మీరు పనిలో పెట్టుకునే వారిలో ఉత్తమమైన వాడు బలవంతుడు, విశ్వసనీయుడు." ఈ దివ్య ఖుర్ఆన్ వాక్యంలో ఆ అమ్మాయి తన తండ్రికి మూసా (అస)ను పనిలో పెట్టుకోమని సిఫార్సు చేసిన రెండు లక్షణాలు: ఒకటి బలవంతుడు కావడం అంటే సమర్థుడు, రెండవది నిజాయితీపరుడు. ఈ రెండు లక్షణాలు ఒక వ్యక్తిలో ఉంటే, అతను సమాజానికి చాలా ఉపయోగకరమైనవాడవుతాడు. మనిషి సమర్థుడైనప్పటికీ నిజాయితీ లేకపోతే తన సామర్థ్యాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తాడు. మనిషి నిజాయితీపరుడు, సత్యసంధుడైనప్పటికీ తెలివైనవాడు కాకపోతే, తన పదవికి తగిన సామర్థ్యం లేకపోతే, అటువంటి నిజాయితీపరుని వల్ల ప్రయోజనం ఉండదు. ఒక వైద్యుడు నిపుణుడు అయినప్పటికీ నిజాయితీ లేకపోతే రోగులను దోచుకుంటాడు. నిజాయితీ పరుడైనప్పటికీ వైద్యంలో నైపుణ్యం లేకపోతే రోగికి సరైన చికిత్స చేయలేడు. దైవప్రవక్త యూసుఫ్ (అస) రాజు ముందు తన సేవల గురించి ప్రతిపాదించినప్పుడు రెండు లక్షణాలను పేర్కొన్నారు: 'దేశ ఖజానాలను నాకు అప్పగించండి. నిశ్చయంగా నేను సంరక్షించేవాడిని. ఆ జ్ఞానం కలవాడిని" (యూసుఫ్: 55). ఒక లక్షణం 'సంరక్షించడం', అంటే నేను విశ్వాసంతో దేశ ఆర్థిక వ్యవస్థను రక్షిస్తాను. రెండవ లక్షణం 'జ్ఞానం'. అంటే దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తమంగా నిర్వహించే జ్ఞానం, నైపుణ్యం. దివ్యఖుర్ఆన్ అల్లాహ్ వాక్కు. అందులోని సూత్రాలు వివిధ సందర్భాలలో తెలియజేయబడినప్పటికీ ఒకే విధమైనవి. దివ్యఖుర్ఆన్ ఎలాంటి వైరుధ్యాలు లేనిది.

**6) హక్కుల పరిరక్షణ :** ప్రజలెవరైనా గాని, ముస్లింలు లేదా ముస్లిమేతరులు ఎవరైనా సరే, వారందరి ప్రాణాలు, ఆస్తులు, గౌరవ మర్యాదలు, మతస్వేచ్ఛలకు ఇస్లామీయ ప్రభుత్వం హామీ ఇస్తుంది. అధికార బలంతో ముస్లిమేతరుడిని ఇస్లాంలోకి బలవంతంగా మార్చకూడదు. అందరి ప్రాణాలు పవిత్రమైనవి. వ్యక్తిగత శత్రుత్వం విమర్శల కారణంగా కక్షతో చర్యలు

> మనిషి సమర్థుడైనప్పటికీ నిజాయితీ లేకపోతే తన సామర్థ్యాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తాడు. మనిషి నిజాయితీపరుడు, సత్యసంధుడైనప్పటికీ తెలివైనవాడు కాకపోతే, తన పదవికి తగిన సామర్థ్యం లేకపోతే, అటువంటి నిజాయితీపరుని వల్ల ప్రయోజనం ఉండదు. ఒక వైద్యుడు నిపుణుడు అయినప్పటికీ నిజాయితీ లేకపోతే రోగులను దోచుకుంటాడు. నిజాయితీ పరుడైనప్పటికీ వైద్యంలో నైపుణ్యం లేకపోతే రోగికి సరైన చికిత్స చేయలేడు.

తీసుకోరాదు. పాలకుడు తన ప్రజల శ్రేయోభిలాషిగా ఉండాలి. సన్మార్గగాములైన ఖలీఫాలు తమ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎవరైనా పేదవాడు ఆకలితో నిద్రిస్తాడేమోనని ఆందోళన చెందేవారు. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వం బాధ్యత. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే, నేరం పూర్తిగా రుజువైతే ఇస్లాంలో నేరస్థులకు కఠిన శిక్షలు పేర్కొనబడ్డాయి. కొద్దిమంది నేరస్థులపై దయ చూపి మొత్తం సమాజానికి ముప్పు కలిగించరాదన్నది ఇస్లామీయ ప్రభుత్వ సూత్రం. కొద్దిమంది నేరస్థులను కఠినంగా శిక్షించడం అంటే, క్యాన్సర్ రోగి శరీరం నుండి ప్రభావిత భాగాన్ని కోసివేయడం వంటిది. ఆ విధంగా క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించక ముందే సకాలంలో చికిత్స ద్వారా అరికట్టవచ్చు. ఒక హంతకుడికి మరణశిక్షకు బదులుగా జైలు శిక్ష విధిస్తే, అతను విడుదలైన తర్వాత మళ్లీ హత్య చేయడానికి సిద్ధపడతాడు. ఇతరులకు కూడా హత్యలు చేసే ధైర్యం వస్తుంది. కొంతమంది దొంగతనాలకు అలవాటు పడతారు. అవసరమున్నా లేకపోయినా దొంగతనాలు చేస్తారు. హస్తఖండన శిక్షల వంటివి మాత్రమే ఇలాంటి వారిని అదుపు చేస్తాయి. అదేవిధంగా, యాచించడం అలవాటు చేసుకున్న వారికి ఎంత ఆర్థిక సహాయం చేసినా ఆ అలవాటు మానుకోరు. ప్రభుత్వం వారిని యాచించడం మానేసేలా నిర్బంధిస్తేనే ఆ అలవాటు మానుతారు. పాశ్చాత్య దేశాలలో, కొద్దిమంది నేరస్థులపై దయ చూపి వారికి తేలికపాటి శిక్షలు విధించడం చేస్తుంటారు. ఫలితంగా దేశంలోని ప్రజలం దరినీ అభద్రతపాలు చేస్తున్నారు. అదేవిధంగా, ఇస్లామీయ రాజ్యంలో మహిళలు అర్ధనగ్న దుస్తులు ధరించి తిరిగే అనుమతి ఉండదు. అల్లరిమూకల వల్ల స్త్రీల మానమర్యాదలు అభద్రతకు గురికాకుండా చూసే ఏర్పాటిది. అసభ్యకర దుస్తుల వల్ల సగటు పురుషుల ఆలోచనలు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. అసభ్య, అర్ధనగ్న దుస్తుల వల్ల అక్రమ సంబంధాలు తేలిగ్గా ఏర్పడతాయి, చివరికి ఈ సంబంధాలు చాలా భయం కరమైనవిగా రుజువవుతాయి. నేర ప్రపంచంలో, భారతదేశంలో కూడా భార్యలు భర్తలను, భర్తలు భార్యలను హత్య చేస్తున్న వార్తలు వింటున్నాం. అలాగే ఇస్లామీయ ప్రభుత్వం లంచగొండితనం, అక్రమంగా డబ్బు సంపాదించే మార్గాలను కఠినంగా నియంత్రిస్తుంది.

**7) ఇస్లామీయ శాసనాంగం :** ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ ప్రధాన లక్ష్యం ఇస్లామీయ శాసనాలను అమలు చేయడం. సామూహిక వ్యవహారాలలో అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడడం. ఇది ముస్లిం పాలకుడి ప్రథమ కర్తవ్యం. ప్రజలు ఇస్లామీయ శాసనాలను హృదయపూర్వకంగా ఇష్టపడేలా శిక్షణ ఇవ్వాలి. ఇస్లామీయ రాజ్యంలో ఇస్లామేతర ఎజెండాపై పనిచేసే లేదా నాస్తికత్వాన్ని ప్రచారం చేసే, అసభ్యతను ఇష్టపడే పార్టీలకు స్థానం లేదు. ఇస్లామీయ రాజకీయ వ్యవస్థలో బహుళ పార్టీలకు అవకాశం ఉంటుంది, కానీ ఇస్లాం పునాదులను బలహీనపరిచే రాజకీయ పార్టీలకు అవకాశం ఉండదు. ఉదాహరణకు, ఏదైనా నిర్మాణ ప్రాజెక్ట్ కోసం టెండర్ ద్వారా వివిధ నిర్మాణ సంస్థలను ఆహ్వానించినట్లయితే, నిర్మాణ అనుభవం లేని లేదా ప్రాజెక్ట్‌ను విఫలం చేసే సంస్థను ఆహ్వానించడం జరగదు. అదేవిధంగా, ఇస్లామీయ రాజ్యంలో, ఇస్లామీయ శాసనాలను సమర్థించే పార్టీలకు మాత్రమే అవకాశం ఉంటుంది. బహుళ పార్టీ వ్యవస్థ ప్రయోజనం ఏమిటంటే, పాలక పార్టీని ప్రశ్నించడానికి అనేక పార్టీలు ఉంటాయి, ఇవి ప్రభుత్వాన్ని సరయిన గాడిలో ఉంచుతాయి. లేకపోతే, ఒకే పార్టీ వ్యవస్థ నిరంకుశంగా మారి ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడవచ్చు. కొంతమంది ఎన్నికల వ్యవస్థకు బదులుగా ఖలీఫా చేతిలో ప్రమాణం తీసుకోవాలం టారు. కాని ప్రమాణం ఏ ఖలీఫా ద్వారా తీసుకోవాలో, ఆ ఖలీఫాను నియమించేదెవరన్నది ప్రశ్న. నేటి కాలంలో కోట్ల సంఖ్యలో ప్రజలు ఇలా ప్రమాణం చేయడం సాధ్యమా? ఎవరు ప్రమాణం చేశారో, ఎవరు చేయలేదో పాలకుడికి తెలిసి

పోయినప్పుడు, ప్రమాణం చేయని వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడే ప్రమాదమూ ఉంది. అందువల్ల, రహస్య బ్యాలెట్ ఓటింగ్ వల్ల ఈ సమస్య ఉండదు. ఇవి కాలక్రమేణా అభివృద్ధి చెందిన విషయాలు.

రాజకీయ ఎన్నికలలో ఓటింగ్ కూడా మానవ ప్రగతి వికాసాల క్రమంలో అభివృద్ధి చెందిన అంశం. ఏ విధంగానైతే గుర్రాలపై ప్రయాణించే బదులు నేడు విమానంలో ప్రయాణించడం జరుగుతుందో అదేవిధంగా ఇది అభివృద్ధికి ఒక రూపం. మానవ అభివృద్ధి ద్వారా అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుంటూ, మనం ఇస్లామీయ సూత్రాలకు ఆచరణాత్మక రూపం ఇవ్వాలి. ఇది ఇజ్తిహాద్. మతపరమైన, లౌకికమైన విషయాలలో లోతైన జ్ఞానం ఉన్నవారు ఇజ్తెహాద్ ద్వారా రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలను ఇస్లామీయ సూత్రాల వెలుగులో ఆధునిక సిద్ధాంతాలను సంస్కరించగలరు. దివ్యఖుర్ఆన్ అనువాదా లను, ప్రింటింగ్ ప్రెస్‌ను, లౌడ్‌స్పీకర్‌ల వాడకాన్ని, వీడియోగ్రఫీని నిషేధించిన ధర్మవేత్తల వారసులే నేడు వీటన్నింటినీ అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. ఇజ్తెహాద్ (షరీఅత్ సూత్రాలను అన్వయించే) తలుపు ఎప్పటికీ మూసి వేయకూడదు. ఇజ్తెహాద్ నలుగురు ఇమామ్‌లతో ముగియలేదు. ప్రళయం వరకు కొనసాగవలసిన ప్రక్రియ ఇది.

**8) దావత్, ఇస్లాహ్ (ప్రచారం, సంస్కరణ)** : ముస్లిం పాలకులు తమ ప్రజలలోని ముస్లిమేతరులకు ఇస్లాం సందేశాన్ని చేరవేయడానికి ఏర్పాట్లు చేసే ప్రచార స్పృహను కలిగి ఉండాలి. అదే సమయంలో, ముస్లింలలో సంస్కరణ పని కొనసాగాలి. అల్లాహ్ శుక్రవారం ప్రసంగాలను ముస్లింల మధ్య సంస్కరణకు చాలా ప్రభావవంతమైన సాధనంగా చేశాడు. ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో, వారు శుక్రవారం ప్రసంగం చేసేవారు. ఖిలాఫత్ కాలంలో, ఖలీఫా శుక్రవారం ప్రసంగం ద్వారా మింబర్ (వేదిక) నుండి ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం బాధ్యత. అమ్ర్ బిల్ మఅరూఫ్ వ నహీ అనిల్ మున్‌కర్ (మంచిని ఆజ్ఞాపించడం, చెడును నిరోధించడం) యొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించడమే ముస్లిం ఉమ్మా ఉనికి యొక్క ఉద్దేశ్యం. ఖురాన్‌లో చెప్పబడింది: ఇస్లామీయ రాజ్యంలో, ప్రభుత్వ పర్యవేక్షణలో దావత్, ఇస్లాహ్ యొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ఒక శాఖ ఉండాలి, తద్వారా ముస్లిమేతరులు ఇస్లామీయ విలువలను తెలుసుకుంటారు. ముస్లింలు ఆ విలువలతో హృదయపూర్వక అనుబంధాన్ని కలిగి ఉంటారు.

**(మిగతా వచ్చేవారం)**

# విషాద వెలుగు

నవ వధువు
జీవితం వికసించబోతున్న రోజులు
ఐదవ రోజే..
తన సగ ప్రాణాన్ని కోల్పోయింది.

పహెల్గాం కొండల్లో దాగిన
మబ్బుల కన్నా గాఢమైన శోకం,
ఆమె హృదయాన్ని
మౌనంగా కమ్ముకుంది.

కానీ మాటల్లో మాత్రం వెలుగే వెలుగు,
వేదనలోనూ విశాలమైన శాంతి.
'న్యాయం కావాలి' అంటోంది ఆమె,
కానీ అది పగ లేక నింద కోసమేమీ కాదు.

'సామరస్యం కావాలి'
తడిచిన కన్నీటి మాటల్లోనూ,
ద్వేషానికి తావీయక తీపి ఆశయంతో.
భర్తను కోల్పోయిన రోజునుంచీ
ఒక్కమాట కూడా ఆమె
మతంపై నింద వేయలేదు.

నేడు కొందరు ఎవరిని ద్వేషిస్తున్నారో,
వారి ప్రేమను, ఆప్యాయతనే
ఎలుగెత్తి చాటిందామె
అది మానవతకు నిలువెత్తు నిదర్శనం.
'కశ్మీరీలను నిందించవద్దు' అంటోంది ఆమె,
వేదనకు మతం కారణం కాదని నమ్ముతూ.

జన్మదినం ప్రేమ దూరమై
జ్ఞాపకాలే మిగిలిన రోజు,
ఆమె మాటలతో శోకాన్ని కాదు
శాంతీ, మానవతా పరిమళం పంచింది.

హిమాన్షీ! నీ మాటలు గుండెను తాకాయి.
నీ ధైర్యం, నీ నిశ్చలత,
నీ సందేశం భవిష్యత్తుకు దిక్సూచి.
'వేదనలో వెలసిన
మానవత్వపు రత్నం నీవు'!

**- యండి. ఉస్మాన్ ఖాన్**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు మక్కా అవతరణ

# 46. అల్ అహ్కాఫ్

## ప్రవేశిక (గత సంచిక తరువాయి)

చివరికి ఆయన ఓ సంకల్పం చేసుకుని తాయిఫ్‌కు వెళ్ళారు. ఆయన, బనీ సకీఫ్‌కు ఇస్లామ్ సందేశాన్ని అందజేయాలని, వారు ఇస్లామ్ స్వీకరించకపోతే, కనీసం తనకు వారి పట్టణంలోనే నెమ్మదిగా కూర్చుని సందేశకార్యకలాపాలు నిర్వహించే అవకాశమిచ్చేందుకు సమ్మతింపజేయాలని అనుకున్నారు. అప్పుడు ఆయనకు ఎటువంటి వాహనం ప్రాప్తం కాలేదు. మక్కా నుండి తాయిఫ్ వరకు మొత్తం పయనం ఆయన కాలినడకన పూర్తి చేశారు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆయన ఒంటరిగా వెళ్ళారు. మరి కొన్నింటి ప్రకారం ఆయనతో పాటు కేవలం హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజిఅల్లాహు అన్హు) మాత్రమే ఉన్నారు. అక్కడకు చేరిన తరువాత ఆయన కొన్ని రోజులు బస చేశారు. సకీఫ్ నాయకులు, గౌరవనీయులయిన పెద్దల వద్దకు వెళ్ళి ఒక్కరొక్కరిని కలుసుకుని మాటలాడారు. కాని వారు ఆయన ప్రతిపాదనను దేన్నీ అంగీకరించకపోవడమే కాక ఆయన్ని గట్టిగా మందలించారు, తమ పట్టణం నుండి వెళ్ళిపోవాలని. ఆయన ప్రచారం తమ యువతను "చెరిపి"వేస్తుందన్న భయం వారికి కలిగింది. గత్యంతరంలేక ఆయన తాయిఫ్ వదలవలసివచ్చింది. ఆయన అక్కడి నుండి బయలుదేరినప్పుడు సకీఫ్ నాయకులు తమ పట్టణంలోని గూండాలను, రౌడీమూకను ఆయన్ని వెంబడించడానికి పంపారు. వాళ్ళు దారికి రెండు వైపులా చాలా దూరం వరకు ఆయన మీద పోకిరి నినాదాల విసుర్లతో, తూలనాడుతూ, రాళ్ళు రువ్వుతూ వెంట వెళ్ళారు. ఆయన గాయాలతో బాగా నెత్తురోడుతున్నారు. ఆయన పాదరక్షలు నెత్తుటితో నిండిపోయాయి. ఈ పరిస్థితిలో ఆయన ఒక తోట గోడ నీడలో సేదదీరడానికి కూర్చుండిపోయారు. అప్పుడాయన తన ప్రభువును వేడుకున్నారు:

"దేవా, నా వివశతను, అశక్తతను, జనుల చూపుల్లో విలువలేమిని గురించి నేను నీ సన్నిధినే ఫిర్యాదు చేస్తున్నాను. కరుణామయుల్లోకెల్లా కరుణామయుడా, నీవు సమస్త బలహీనులకు ప్రభువువి, నా ప్రభువు కూడా నీవే. నన్ను ఎవరిపాలు చేస్తావు? ఎవరో అపరిచితునికి నన్ను అప్పగిస్తున్నావా? నా పట్ల కఠినంగా వ్యవహరించే వానికా? లేదా నన్ను లోబరచుకునే శత్రువుకా? నీవు నా ఎడల అసంతుష్టుడివి కాకపోతే చాలు, నాకు ఎటువంటి కష్టం ఎదురయినా ఫరవాలేదు. నీ పక్షాన నెమ్మది నాకు ప్రాప్తిస్తే అదే పదివేలు, అందులోనే నాకు సకలవిధాలా సౌలభ్యముంది. నీకు స్వంతమయిన నీ ఉనికిలోని జ్యోతి శరణు కోరుతున్నాను. అది చీకటిలో వెలుగును ప్రసాదిస్తుంది, ప్రపంచ వ్యవహారాలనూ పరలోక విషయాలనూ చక్కదిద్దుతుంది. నీ క్రోధం నన్ను పట్టుకోకుండా నేను నీ ఆగ్రహానికి పాత్రుణ్ణి కాకుండా నన్ను కాపాడు. నీ ప్రసన్నతే నాకు సమ్మతమయ్యేలా, చివరికి నీవే నా పట్ల సంతుష్టుడివయ్యేలా చెయ్యి. నీవు లేనిదే ఏ బలమూ లేదు, ఏ శక్తీ లేదు." (ఇబ్ను హిషామ్ సం.2, పేజీ 62)

భగ్న హృదయులయి, దుఃఖభంజితులయి వెనుతిరిగి ఆయన 'కర్నల్ మనాజిల్' దగ్గరికి చేరినప్పుడు ఆకాశాన ఏదో మేఘం ఆవరించినట్లు గోచరించింది. చూపు పైకెత్తి చూస్తే ఎదురుగా జిబ్రీల్ (అలైహిస్సలాం) కన్పించారు. ఆయన బిగ్గరగా చెప్పారు, "మీ జాతి మీకు ఇచ్చిన సమాధానమేదో అల్లాహ్ విన్నాడు. ఇప్పుడు పర్వత నిర్వాహకుడయిన దైవదూతను అల్లాహ్ పంపాడు. మీరు ఏ ఆజ్ఞను జారీ చేయదలచినా ఇతనికి పురమాయించండి." తరువాత పర్వతాల దైవదూత ఆయనకు సలామ్ చేసి విన్నవించుకున్నాడు, "మీరు సెలవిస్తే ఇరువైపుల కొండల్ని ఈ జనులపైన తలక్రిందులుగా పడవేస్తాను." అప్పుడాయన (స) బదులు పలికారు, "అలా వద్దు, వీరి సంతతిలో ఒకే ఒక్క దైవానికి దాస్యం చేసేవారిని అల్లాహ్ పుట్టిస్తాడని నాకు నమ్మకముంది." (బుఖారీ, బదఉల్ ఖల్క్, జిక్రుల్ మలాఇక ముస్లిమ్, కితాబుల్ మగాజీ; నసాయి, అల్ బఊస్).

**(మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## హజ్జతుల్ వదా (వీడ్కోలు హజ్జ్)

**264)** అబూబక్రా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రబోధించారు– "కాలచక్రం తిరిగి తిరిగి, అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి చేరుకుంది. చూడండి! సంవత్సరానికి 12 నెలలు ఉంటాయి. వాటిలో నాలుగు నెలలు పవిత్రమైనవి (నిషిద్ధ మాసాలు). వాటిలో మూడు ఒకదాని తరువాత ఒకటి వస్తాయి– జీఖఅద, జిల్‌హజ్జా, ముహర్రమ్. నాల్గవ మాసం రజబ్. అది జమాది ఉల్ ఊలా నెలకి – షాబాన్‌కి మధ్యన ఉంటుంది. (ఆ తరువాత ఆయన–స ఇలా అడిగారు) "ఇది ఏ నెల?" దానికి మేము 'ఈ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని బదులిచ్చాము. ఇది విని ఆయన(స) కొన్ని క్షణాలు మౌనం వహించారు. బహుశా ఆయన(స) ఈ ప్రఖ్యాత నెలకు మరో పేరు పెట్టనున్నారేమోనని తలపోశాము. కాని ఆయన(స), "ఇది జిల్‌హజ్జా నెల కాదా?" అని అడిగారు. 'అవును. ఖచ్చితంగా అదే' అని మేము విన్నవించుకున్నాము.

తరువాత ఆయన(స) "ఇది ఏ నగరం?" అని ప్రశ్నించారు. దానికి మేము, 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే బాగా ఎరుగు' అని సమాధానమిచ్చాము. ఆయన (స) మళ్ళీ నిశ్శబ్దంగా ఉండిపోయారు. బహుశా ఆయన, ఈ విశ్వవిఖ్యాత నగరానికి మరో పేరు పెడతారేమోనని భావించాము. కాని ఆయన(స) నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, "ఇది మక్కా (పుణ్యపురి) కాదా?" అని అడిగారు. దానికి మేము, 'ఎందుకు కాదు? (నిశ్చయంగా ఇది పవిత్ర మక్కా నగరమే)' అని చెప్పాము.

పిదప ఆయన(స) "ఇది ఏ దినం?" అని అడిగారు. 'ఈ సంగతి అల్లాహ్‌కు, ఆయన సందేశహరునికే బాగా తెలుసు' అని చెప్పాము. ఆయన(స) ఈసారి కూడా కొన్ని క్షణాలు మౌనం వహించారు. బహుశా ఈ దినానికి గల సుప్రసిద్ధ నామానికి బదులు ఆయన మరో పేరు పెట్టబోతున్నారేమోనని మేము ఊహించాము. కాని ఆయన(స) మమ్మల్ని ఉద్దేశించి "ఇది యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) కాదా?"[1] అని అడిగారు. 'ఖచ్చితంగా ఇది ఖుర్బానీ దినమే' అని మేము చెప్పాము.

ఆ తరువాత "ఈ దినం, మీ ఈ నగరం, మీ ఈ నెల పవిత్రం (నిషిద్ధం) అయినట్లే మీ రక్తం, మీ సంపద, మీ మాన మర్యాదలు పవిత్రం (నిషిద్ధం) గావించబడ్డాయి. మీరు అతి త్వరలోనే మీ ప్రభువును కలుసుకోబోతున్నారు. ఆయన మిమ్మల్ని మీ ఆచరణల గురించి ప్రశ్నించనున్నాడు. చూడండి! నా తదనంతరం మీరు మార్గభ్రష్టులై పరస్పరం మీ మెడలు నరుక్కోకండి. ఇక్కడ ఉన్నవారు ఇక్కడ లేనివారికి ఈ విషయాన్ని చేరవేయండి. ఇక్కడ ఉండి విన్నవారి కన్నా ఇక్కడ లేనివాడు ఈ సందేశాన్ని విని బాగా జ్ఞాపకం ఉంచుకోవచ్చు". ముహమ్మద్ బిన్ సీరీన్ గారు ఈ హదీసును ప్రస్తావించినప్పుడల్లా 'ముహమ్మద్(స) సత్యం పలికారు' అని అనేవారు– తరువాత ఆయన(స) ఇలా అన్నారు: "నేను సందేశాన్ని మీకు చేరవేశానా?". ఆయన(స) రెండుసార్లు ఇలా అన్నారు.

264-1. ఇంతకీ జరిగిందేమిటంటే, అప్పట్లో బహుదైవారాధకులు నిషిద్ధ మాసాలను తమ స్వార్థ ప్రయోజనాలకనుగుణంగా వెనక్కీ ముందుకీ జరుపుకునేవారు. నెలల్ని తారుమారు చేసేవారు. ఉదాహరణకు- ముహర్రమ్ నెలలో పోరాడటం నిషిద్ధం. కాని ఆ నెలలో యుద్ధం చేయటం అవసరం అని వారు భావిస్తే ఆ నెలను సఫర్ మాసంగా పరిగణించి, సఫర్ మాసానికి ముహర్రమ్ మాసం అని పేరు పెట్టేవారు. ఈ విధంగా వారు అనాదిగా నెలలను తారుమారు చేస్తూ, దైవ ధర్మంతో చెలగాట మాడేవారు. అంతిమ దైవప్రవక్త(స) తన వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా ఈ వ్యవస్థలోని చెడుగును సంస్కరించారు.

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

ఐదవ భాగము

# ఇస్లామీయ ఉద్యమ భవిష్యత్తు

(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుండి....)

## ఇస్లామీయ ఉద్యమ విజన్ - ముఖ్యాంశాలు

ఇస్లామీయ ఉద్యమ భవిష్యత్తు, దాని సమీప విజన్ ఏమై ఉండాలి? అనే విషయం రానున్న పంక్తుల్లో తెలిపే ప్రయత్నం చేస్తాను. **"దేశంలోని ముస్లింలు, ధార్మిక, నైతిక, విద్యావిషయకంగా, సాంస్కృతికంగా ఎంత ఉన్నతంగా ఎదగాలంటే– తద్వారా మనదేశ ప్రజలకు మాట– చేత ద్వారా సంపూర్ణ ఇస్లామీయ రూపాన్ని ప్రదర్శించాలి. సోదర దేశ వాసులతో కలసి – మెలసి ఈ దేశంలో శాంతి, న్యాయం, మానవ విలువలపై ఆధారపడిన సమాజాన్ని నిర్మించాలి."**

పై వివరణలో ముస్లిం సమాజం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు కనపడుతుంది. ఇది తప్పనిసరి, అవసరమైనది కూడా. నేడు విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం మూలంగా సందేశ ప్రచార ఉద్యమం విశాల ప్రజానీకం వరకు చేరుతుంది. **ఇస్లాం ఒక ప్రచార ఉద్యమంగా సోదర దేశవాసులకు చేరుతుంది. వారిని ప్రభావ పరుస్తుంది కూడా. రానున్న కాలంలో ఇది మరింత ఉధృతం అవుతుంది కూడా. ఈ పరిచయ ఉద్యమం మరింత ప్రభావం చూపాలంటే ఉద్యమకారులు అయిన ముస్లింలు, సదరు ఉద్యమ స్థాయిలో ఉండటం అవసరం. ఏ విలువల గురించి ప్రచారం చేయబడుతుందో – ఆ విలువలు ఆచరణాత్మకంగా ముస్లింలలో ఉండటం తప్పనిసరి. అలా కాకుంటే మాటకు – చేతకు పొంతన లేకుండా పోతుంది. ఇది ప్రభావరహిత ఉద్యమంగా రుజువు అవుతుంది. ఈ కారణంగానే మనం ఉద్యమ ప్రచార ఉమ్మత్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపవలసి ఉంది. అందుకొరకు సామూహిక సంస్కరణకు పూనుకోవాలి. శ్రద్ధగా దానిపై ఆచరించాలి. ఈ ఉమ్మత్ సభ్యుల ద్వారానే మనదేశంలో గుణా త్మక మార్పుకు శ్రీకారం చుట్టాలి. ఇదే మన నిజమైన వివేకవంతమైన ఆచరణగా ఉండాలి.**

పై విజన్ సాధన కోసం ఓ ఐదు అంశాలను పరిశీలన కోసం ప్రతిపాదించడం జరుగుతుంది.

## 1) అంతర్గత వైమనస్యాలకు ముగింపు

ఏ పరిస్థితుల్లో ఇమామ్ మౌదూదీ (రహ్మ) మద్రాస్ ప్రసంగం చేశారో, అంతకంటే మించిన పరిస్థితులు నేడు ఉమ్మత్‌పై ఆవహించి ఉన్నాయి. ఆయన ఈ పరిస్థితులకు విరుగుడుగా ఏఏ విషయాలు ప్రస్తావించారో అవన్నీ నేడు ఆచరణీయాలుగా మన ముందు ఉన్నాయి. హిందూ జాత్యాహంకారం నేడు అధికారంలో ఉండటమే కాదు, దాని వెనుక కొన్ని సామాజిక వర్గాల శక్తి కూడా మద్దతుగా వుంది. ఇక అంతర్జాతీయ ఇస్లాం వ్యతిరేక శక్తులు కూడా వీరికి సహాయంగా ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికలలో మత భక్తి, జాతీయవాద భక్తి ముస్లింలపై కూడా ప్రసరించినట్లు స్పష్టం అయ్యింది. మెజారిటీ జాతీయ భక్తికి ఎదురుగా మైనారిటీ జాతీయ భక్తి క్రమంగా బలం పుంజుకుంటున్న దృశ్యం

మనకు కానవస్తుంది.

ఒక ముస్లిం ఉమ్మత్, తమలోని అంతర్గత వైమనస్యాలను దూరం చేసుకుంటే, సంస్కరించుకుంటే ప్రస్తుత దేశ సామాజిక, రాజకీయ పరిస్థితిని ఒక అవకాశం(Opportunity)గా మార్చుకో వచ్చు. ఇస్లాం పట్ల పెరుగుతున్న వ్యతిరేకత నుండియే, సందేశ ప్రచార అనుకూలతను సృష్టించవచ్చు. కనుక ఇస్లామీయ ఉద్యమం భవిష్యత్తులో ఈ అంశంపట్ల తీవ్రంగా కృషి చేయవలసి వుంటుంది. ఈ విషయంలో సారథ్యపు బాధ్యతలను కూడా పోషించవలసి ఉంటుంది. ఈ క్రమంలోనే అంతర్గత వైమనస్యాలను సంస్కరించే కృషి చేయాలి. మరి ఈ పని ఎలా చేయాలి? దానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక ఏమిటి? ఈ విషయంపై కూడా స్థిరంగా, నింపాదిగా ఆలోచించి, ఆచరణా ప్రణాళిక రచించుకోవాలి.

అ) రాజకీయాలలో ముస్లింలు వేర్పాటువాద రాజ కీయాలు వీడాలి. రాజకీయాలలో జాతి, వర్గం, మత పక్షపాతాలకు దూరంగా వ్యవహరించాలి, మత ఆధారిత రాజకీయాలను త్యజించాలి.

ఆ) దేశంలోని ప్రజలందరి సమస్యలపై అనాసక్తత వీడాలి. సాధారణ హిందూ (దళిత, శూద్ర, ఇతర గిరిజన) ప్రజల సమస్యలపై కూడా స్పందించాలి. కేవలం ముస్లింల సమస్యలపై మాట్లాడేతత్వాన్ని వీడాలి.

ఇ) తక్కువ ప్రాధాన్యత గల అంశాలపై ఎక్కువగా స్పందించడం, ప్రధాన సమస్యలపై అసలు స్పందించకపోవడం, లేదా 'నామ్‌కేవాస్తే' గా స్పందించడం మానాలి.

ఈ) ప్రధానమైన అంశాలలో క్రియాశీలంగా ఉండాలి. ఉదాహరణకు తీవ్రవాదం – ఉగ్రవాద విషయంలో మౌనం వీడాలి. సోదర దేశవాసులతో, ముస్లిమేతర సమాజాలతో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తొలగించాలి.

## 2) మనదేశ నేపథ్యంలో ఇస్లాంను చర్చనీయాంశం చేయాలి

నా ఉద్దేశ్యంలో ప్రస్తుతం ఇస్లామీయ ఉద్యమం చేయవలసిన అతి ముఖ్యమైన పని ఇదియే. స్వాతంత్ర్య ఉద్యమానికి ముందు అప్పటి ఇస్లామీయ ఉద్యమం, ప్రజల వద్ద ఒక చర్చనీయాంశంగా ఇస్లాంను ఉంచింది. ఇస్లాంను రాజకీయ వ్యవస్థగా, సామూహిక నిర్మాణం, ఇస్లామీయ విలువలను ప్రజల చేత ఆమోదింప చేయడం, పాశ్చాత్య సంస్కృతి, ఇస్లామీయ విలువలను ప్రజలచేత ఆమోదింపచేయడం, పాశ్చాత్య సంస్కృతి, భావనలపై తీవ్రమైన విమర్శలు, స్పందించటం అప్పటి 'డిస్‌కోర్స్' ప్రత్యేకతగా ఉండింది. స్వాతంత్ర్యం తర్వాత నిర్మాణమైన మనదేశంలో వివేక వంతమైన సందేశ ప్రచార విధానం పాలసీలను మనం నిర్మించుకున్నాం. కానీ, ఉద్యమాన్ని ఒక సిద్ధాంతంగా, విశ్వాసంగా 'డిస్‌కోర్స్'గా నిలబెట్టలేకపోయాం. మన ఉపన్యాసకుల ఉపన్యాసాలు, మన కార్యకర్తల పుస్తక పఠన, సమావేశాలు, చర్చలు అన్నీ మనకు ఒక సుందర స్వప్నం, భవిష్యత్తును చూపాయి. కాని, దానిని స్థాపించడానికి అవసరమైన కార్యాచరణ – చర్చించవలసిన అంశాలు, ఇస్లాంను 'డిస్‌కోర్స్'గా ప్రజలతో సంబంధాలు (Engagement)కల్పించడంలో వెనుకబడే ఉన్నాయి.

ఈ పరిస్థితి మనల్ని సైద్ధాంతికంగా గందరగోళానికి గురిచేసింది. ఫలితంగా ఆచరణలో సందేశపు ఒక పెద్ద భాగం మన నుండి వేరుపడిపోయింది. రానున్న కొన్ని సంవత్సరాలు మనం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించి పని చేయవలసి ఉంది. ఇందుకు విశాల దృష్టితోపాటు దూరదృష్టి కూడా అలవర్చుకోవాలి. పరిశోధన, రచనలతోపాటుగా, సెమినారుల్లో విద్యా విషయక చర్చల్లోనూ పెద్ద ఎత్తున ఇస్లాంను చర్చనీయాంశంగా మార్చాలి. దేశ పరిస్థితుల నేపథ్యంలో, లభించిన అనుమతులకు లోబడి, డిస్‌కోర్స్‌ను నిలబెట్టడం నేటి అత్యవసర ఆచరణగా వుంది.

ఇస్లామీయ ప్రాథమిక, మౌలిక విశ్వాసాలే కాకుండా, ఇస్లామీయ ఆధ్యాత్మికత (రూహానియత్), ఇస్లామీయ సామాజికత, ఆర్థికత, మానవ హక్కులు, ఇస్లామీయ నైతికత, విద్యాజ్ఞానాల ప్రబోధాలు, అభివృద్ధి, రక్షణ వాతావరణ పరిరక్షణలకు సంబంధించిన అంశాలన్నీ ఈ 'డిస్‌కోర్స్'లో చర్చనీయాంశాలు కావాలి.

## 3) ఈ 'డిస్‌కోర్స్' (చర్చనీయాంశం) ద్వారా కనీసం పట్టణ భారత ప్రజలవరకు ఇస్లాంను హెచ్చుతగ్గులు లేకుండా పరిచయం చేయాలి

ఈ లక్ష్యం ఆచరణలో చాలా కష్టతరమైంది. కాని, అసాధ్యం మాత్రం కాదు. ముస్లిం ఉమ్మత్‌లో సందేశ ప్రచార ఉత్సాహం పెద్ద ఎత్తున ఉరకలు వేస్తుంది. ఏ స్థాయిలో ప్రసార మధ్యమాలలో అభివృద్ధి సాధించబడుతూ వుందో, అదే స్థాయిలో సందేశ ప్రచారం కూడా ఉధృతం కావాలి. ప్రతి మనిషి చేతికి ఈ సందేశం, ఆయా స్థాయిల్లో ఆయా మాధ్యమాల ద్వారా అందించబడాలి. ఈ పరిస్థితులన్నింటినీ, ఉద్యమం సహేతుకంగా, శాస్త్రీయంగా, వివేకవంతంగా ఉపయోగించగలిగితే, నిర్ణయించబడిన లక్ష్యం, సాధించడం పెద్ద కష్టమైన పనికాదు. **ఇందుకు ఈ సందేశ ప్రచారాన్ని ఒక సంస్థాగత రూపంగాకాక, ఒక ఉద్యమ రూపంగా మార్చాలి. అందుకు అవసరమైన విశాల దృక్పథం, ఆచరణ మనం అవలంబించాలి.**

## 4) ముస్లిం ఉమ్మత్ సంస్కరణ ద్వారా శక్తివంతం (Empowerment) కావాలి. ఒక సామాజిక శక్తిగా ఎదగాలి

చెప్పబడినట్లుగా, భవిష్యత్తులో సందేశ ప్రచారం పెద్దస్థాయిలో ఆచరణలోకి వస్తుంది. కాని ఇస్లాం వైపు సానుకూలంగా స్పందించే విషయంలో అనేక ఆటంకాలు, అవరోధాలు ఎదురయ్యే కారణాల్లో స్వయంగా ముస్లింల వెనుకబాటుతనం కారణం అవుతుంది. ఉమ్మత్‌లో సామూహికంగా నైతిక విలువల లేమి, సామాజిక విలువల లేమి ప్రధాన కారణాలవుతాయి. కనుక ధర్మసంస్థాపనా మార్గంలో ఒక తప్పనిసరి పనిగా, సంస్కరణగా ఉమ్మత్‌కు ఈ బలహీనత నుండి బయటపడే మార్గాలు చూపాలి. దాని రూపురేఖలను ఉన్నతంగా సింగారించాలి. ఈ మార్పు కేవలం ధార్మిక, నైతిక, సంస్కరణగా మాత్రమే ఉండకూడదు. ఇది 'శక్తివంతం' (Empowerment) అయ్యేదిగా కూడా ఉండాలి. నైతిక విలువల పతనం, చిరు నేరస్త జీవితం, సాధారణ సంబంధాల్లో చెడు అలవాట్లు, గొడ వలు, తగాదాలు, సంకుచిత భావనలు, స్త్రీలపై అత్యాచారాలు, వారి హక్కులను హరించడం, కుటుంబ వ్యవహారాల్లో చెడు నడతలు, వ్యాపారాల్లో నీతిరాహిత్యం, సాధారణ వ్యవహారాల్లో నిజాయితీ, బాధ్యతా భావనల లోపం మొదలగు చెడుల నుండి ఉమ్మత్‌ను సంస్కరించవలసి ఉంటుంది. ఒక బహుళ సమాజంలో ఒక ముస్లిం ఎంతటి ఆదర్శవంతంగా జీవించాలో–నేర్పడం జరగాలి. విద్యా రాహిత్యం, శుచి – శుభ్రతల పట్ల నిర్లక్ష్యం, దూరదృష్టి లేనితనం కూడా సామాజిక బలహీనతకు ప్రబల కారణాలవుతాయి.

పై ముఖచిత్రంతో పాటు, ముస్లింల పేదరికం, ప్రసార సాధనాలలో వారి గొంతు వినిపించని స్థితి శాసన, చట్ట సభల్లో వారి ప్రాతినిధ్య లేమి, ప్రతిభలను ప్రదర్శించలేని వాతావరణం, అవకాశాలు దొరకని స్థితి – ఇవన్నీ కలిసి, ముస్లిం సమాజం ఈ దేశానికి, ఒక వరప్రసాదంగా Asset గా కాకుండా ఒక బరువుగా, భారంగా Liabilityగా భావించబడుతుంది. ఈ పరిస్థితి కూడా ప్రజలను ఇస్లాంవైపు సకారాత్మక దృష్టి పడకుండా అవరోధంగా మారింది. ఈ పరిస్థితి ఉమ్మత్‌ను బలహీనపరుస్తుంది. ఆత్మన్యూనతకు గురి చేస్తుంది. అధమ స్థాయికి (Vulnerable) నెట్టివేస్తుంది. ఫలితంగా సామాజిక రంగంలో వీరి స్థానాన్ని బలహీనపరుస్తుంది. లేదా వీరి ఉనికి గుర్తించని వాతావరణం కల్పిస్తుంది.

రానున్న పదిహేను ఇరవై సంవత్సరాలు మనం ఈ విషయం మీదనే దృష్టిని కేంద్రీకరించి పని చేయవలసి ఉంటుంది. తద్వారా ఈ క్రింది మార్పులు ఫలితాలు మిల్లత్‌లో సాధించవలసి ఉంటుంది.

అ) ముస్లింలు కేవలం ఇస్లాంను ఆచరించేవారుగా మాత్రమే కాకుండా తమ నైతికత, సామాజికత, తమ ఆచార వ్యవహారాల ద్వారా ఆచరణాత్మకంగా ఒక సందేశ ప్రచార సముదాయంగా మార్పు చెందాలి. మానవాళి సమక్షంలో సాక్షిగా నిలవాలి.

ఆ) అజ్ఞానం దూరం కావాలి. విద్య అభ్యసించడం సర్వ సాధారణం కావాలి, ఉత్తమ విద్యావేత్తలు ఉనికిలోకి రావాలి.

ఇ) నాగరికత, సంస్కృతిలో ఉత్తమత్వం తొణికిసలాడాలి. విశాల హృదయం, దూరదృష్టి, సహకార భావనలు ఉత్తమ స్థాయికి చేరాలి. ముస్లింల పరిచయం గౌరవ ప్రదంగా మారాలి.

ఈ) పేదరికం కనీస స్థాయి వరకు నిర్మూలింపబడాలి.

ఉ) ప్రతిభలు సమున్నతం కావాలి.

ఊ) రాజకీయ రంగంలో సరైన ప్రాతినిధ్యం సాధించబడాలి. బాధ్యతాయుతమైన, విలువలతో కూడిన రాజకీయ నాయకత్వం ఉనికిలోకి రావాలి.

**5) దేశంలో న్యాయం - సమన్యాయపు వాతావరణం కల్పించి దేశాన్ని శాంతిమండలంగా మార్చాలి:-** జాత్యాహంకారం, కుల, తెగల విద్వేషం, పక్షపాతం, నిమ్నోన్నతలు లేని సమాజ స్థాపన కోసం కృషి జరగాలి. మితిమీరిన పదార్థ పూజ, సంపద పోగు వేసుకునే తత్వం, అత్యాశ, లాభాపేక్ష మరియు అవినీతి, ఇంకా మనదేశ అంతర్గత విషయాల్లో విదేశీ శక్తుల జోక్యం, వారి ముందు తలవంచే దేశీయ బలహీనత, తీవ్రవాదం, ఉగ్రవాదం వగైరాలు మన దేశంలో శాంతికి, అభివృద్ధికి పెద్ద ఆటంకాలుగా నేడు ఉన్నాయి. ఈ ఆటంకాలను తొలగిం చేదిగా మన సామూహిక ఆచరణ ఉండాలి. ఇందుకు ఇస్లామీయ విలువలను ప్రత్యామ్నాయాలుగా ప్రదర్శించాలి. సోదర దేశ వాసులతో భుజం భుజం కలిపి, పేర్కొన్న దౌష్ట్యాలను దేశం నుండి తొలగించేందుకు, తరిమి వేసేందుకు మడమ తిప్పని కృషి, శ్రమ చేయాలి. ఫలితంగా ఈ దేశం ఒక శాంతి మండలంగా, ఒక అభ్యుదయ దేశంగా అభివృద్ధి చెందాలి. ఈ దేశంలో ప్రతి వ్యక్తి, తాను కోరిన భావన కలిగి ఉండే స్వేచ్ఛ పొందాలి. ఇస్లాంను నిరభ్యంతరంగా ఆచరించే, దాని విలువలను ప్రచారం చేసే వాతావరణం నెలకొల్పబడాలి. ముస్లింలతో సహా ఇతర విశ్వాసులు సురక్షితంగా, ఎటువంటి ఆందోళనలకు గురికాని వాతావరణం కల్పించబడాలి. ప్రతి ఒక్కరూ తమ రక్షణ, అభివృద్ధి, ప్రాథమిక వసతులు పొందగలగాలి. తమ హక్కులు, బాధ్యతలు ఎరిగి ప్రతిపౌరుడు ఈ దేశ అభ్యున్నతి, అభివృద్ధి కోసం ఏకోన్ముఖులై పాటుపడాలి.


*(ఈ వ్యాసం రచయిత ద్వారా 2014 డిసెంబర్ – 29, 30 తేదీలలో చెన్నైలో జరిగిన ఒక సమావేశంలో సమర్పించబడింది)*

'చరితార్థులు'-2



# షాకిర్ అలీ బారిష్టర్

## (1879 -1962)




80

**భారత జాతీయోద్యమంలో** పాల్గొన్న యోధాను యోధులకు ఆంగ్లేయ ప్రభుత్వం కల్పిస్తున్న న్యాయపరమైన దిగ్బంధం నుండి విముక్తి కలిగించడానికి పూనుకున్న న్యాయవాదులలో ఒకరైన బారిష్టర్ షాకిర్ అలీ 1879 జూన్ ఏడున ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో జిల్లా కాకొరి గ్రామంలో జన్మించారు. ఆయన పూర్వీకులు మొగల్ దర్బారులో ఉన్నత ఉద్యోగులుగా ఉన్నారు. అబ్బాసీ వంశజ్ఞులుగా ఖ్యాతిగాంచిన ఇక్రా మున్నిసా అబ్బాసీ, అస్గర్ అలీ అబ్బాసీ ఆయన తల్లితండ్రులు. అలీఘర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ఆయన 1905లో లండన్ వెళ్ళి న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేసి బారిష్టర్ పట్టా పొంది 1908లో స్వదేశం తిరిగి వచ్చారు.ఆంగ్ల ప్రభుత్వం కల్పించిన ఉన్నత ఉద్యోగంలో కొంత కాలం గడిపిన ఆయన పరాయి ప్రభుత్వ సేవల నుండి త్వరితగతిన విముక్తులయ్యి న్యాయవాద వృత్తిని ఎన్నుకుని గోరఖ్‌పూర్‌లో స్థిరపడ్డారు. 1919లో గోరఖ్‌పూర్ పరగణాలో ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమ నిర్వహణలో ప్రధాన భాగస్వామ్యం వహించారు. అచిర కాలంలోనే క్రిమినల్ న్యాయవాదిగా ఖ్యాతిగడించిన బారిష్టర్ షాకిర్ అలీ 1921 నుండి 1923 వరకు ఉత్తరప్రదేశ్ విధాన మండలి సభ్యులుగా ప్రజలకు సేవలందించారు. జాతీయోద్యమం పట్ల నియమనిష్ఠలతో ముందుకు సాగిన ఆయన భారతదేశం తూర్పు ప్రాంతాల ప్రజల మన్నల్ని పొంది, భారత జాతీయ కాంగ్రెస్ ప్రముఖ నాయకునిగా వెలుగొందారు. ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వ్యక్తులు, వ్యవస్థలకు తొలి నుండి అండగా నిలిచిన బారిష్టర్ షాకిర్ అలీ 1922 నాటి చౌరాచౌరీ కేసుతో ఆరంభించి, 1927 నాటి కాకొరి కేసు, 1929 మీరట్ కుట్ర కేసు, 1945 ఢిల్లీ ఎర్రకోటలో భారతీయ జాతీయ సైన్యం మీద సాగిన సైనిక విచారణ కేసులలో జాతీయో ద్యమకారుల పక్షాన న్యాయ పోరాటం చేశారు. భారత తూర్పు ప్రాంతాల ప్రజల మనస్సులను చూరగొన్న ప్రముఖ నాయకునిగా నిలచిన ఆయన 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆ ప్రాంతాలలో బాగా ప్రజ్వలింప చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. భారతీయుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లక్ష్యంగా పోరాటం సాగిస్తున్న అఖిల భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ, ప్రాంతీయ కమిటీల సభ్యునిగా సేవలను అందచేసిన జాతీయవాది బారిష్టర్ షాకిర్ అలీ వేర్పాటువాద ఉద్యమాలను నిరసించారు. భారత విభజన ఆలోచనలను పూర్తిగా వ్యతిరేకించారు. భారత దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాక న్యాయవాద వృత్తిని ప్రధాన వ్యాపకంగా చేసుకున్నారు. ప్రముఖ న్యాయవాదిగా ప్రజలకు సేవలందిస్తూ గడిపిన బారిష్టర్ షాకిర్ అలీ 1962 డిసెంబర్ 26న గోరఖ్‌పూర్‌లో తన 84 ఏండ్ల వయస్సులో కన్నుమూసారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్

**'చరితార్థులు' - 2 (తెలుగు)**

THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**(గత సంచిక తరువాయి)**

## సంస్కరణకు సిద్ధమైనప్పుడు...

తొలుత ఆ అబ్బాయి తన తండ్రి ఆజర్‌కు ఎంతో వినయంతో విగ్రహపూజలోని అనౌచిత్యాన్ని గురించి వివరించాడు. కాని తండ్రి ససేమిరా అన్నాడు.

మీరు మొరపెట్టుకుంటున్న ఆ దైవాలు మీ మొరను ఆలకిస్తాయా? మీకు లాభంగాని, నష్టంగానీ కలిగిస్తాయా? అని తన జాతి వారిని నిలదీసి అడిగాడు.

అదంతా మాకు అనవసరం. మా తాతముత్తాతలు ఇలా చేస్తూ ఉండగా మేము చూసి ఉన్నాం. కాబట్టి మేము కూడా అలాగే చేస్తామని జాతి జనులు చెప్పారు.

ఈ సమాధానం ఇబ్రాహీమ్(అ)కు సంతృప్తిని కలిగించలేదు.

మీరూ, మీ తాతముత్తాతలు పూజిస్తూ వస్తున్న ఈ విగ్రహాలతో, చిల్లర దేవుళ్ళతో నేను విసుగెత్తిపోయానన్నాడు. వాటితో పూర్తిగా తెగత్రెంపులు చేసుకుంటున్నానని ప్రకటించాడు. తనను సృష్టించినవాడు, తనకు అనునిత్యం మార్గ బోధన చేసేవాడు, తనకు తినిపిస్తున్నవాడు, త్రాగిస్తున్నవాడు, తనకు జబ్బు చేసినప్పుడు స్వస్థతను ప్రసాదించేవాడు మాత్రమే తన నిజ స్వామి అని చాటి చెప్పాడు. తనను చంపే, తనను తిరిగి బ్రతికించే శక్తి ఆయనకు మాత్రమే ఉందని, తీర్పు దినాన ఆయన తన తప్పులను మన్నిస్తాడన్న ఆశ తనకు ఉందని చెప్పాడు.

ఒకరోజు వారు తమ దేవుళ్ళ ఆశీర్వాదం తీసుకుని ఉత్సవానికి వెళ్ళినప్పుడు ఆ అబ్బాయి మెల్లగా ఆలయంలోనికి ప్రవేశించాడు. అక్కడ ప్రతిష్ఠించబడి వున్న దేవీ దేవతలను ఉద్దేశించి, మీరు మాట్లాడరేమిటి? మీ భక్తులు ఎంతో ప్రేమతో భక్తితో మీకు సమర్పించుకున్న పండ్లు ఫలహారాలను, స్వాదిష్టమయిన ఆహార పదార్థాలను మీరు తినరేమిటి? ఇంత చెప్పినా మీలో ఉలుకూ పలుకూ లేదే? అంటూ తన చేతికి పని తగిలించాడు.

'మా దేవుళ్ళకు ఈ దుర్గతిని పట్టించినదెవరు? వాడెవడో పెద్ద దౌర్జన్యపరుడే అయి ఉంటాడ'ని కేకలేసుకుంటూ, లబోదిబోమంటూ వచ్చారు ఉర్ ప్రజలు. బహుశా అతను ఇబ్రాహీమే అయి వుంటాడని అనుకుని కబురంపారు. మా దేవతలకు ఈ స్థితిని కల్పించింది నువ్వేనా? అంటూ గర్జించారు.

"ఏమో! ఆ పెద్దాయన్నే అడిగి తెలుసుకోండి" అని నింపాదిగా బదులిచ్చాడు ఆ అబ్బాయి అతిపెద్ద విగ్రహాన్ని చూపిస్తూ.

## అహంకారం బుసలు కొట్టింది

ఆ మాట వారికి తగలాల్సిన చోటే తగిలింది. అసలు దుర్మార్గులము మేమే కదా! అంటూ గొణుక్కున్నారు. కాని సత్యాన్ని ఒప్పుకోవడానికి వారి అహం అడ్డుపడింది. పురోహితులు, అగ్రవర్ణాల వారైతే మరీ రెచ్చిపోయారు- ఎందుకంటే ఇబ్రాహీమ్ భావజాలం గనక ప్రజా బాహుళ్యంలో చొచ్చుకుపోయిందంటే తమ పౌరోహిత్యం ప్రమాదంలో పడిపోతుంది. తమ నాయకత్వానికి నూకలు చెల్లుతాయి. అందుకే వారు సామాన్య ప్రజానీకాన్ని ఉసిగొల్పారు-

***"మీరేదన్నా చేయాలనే అనుకుంటే ఇతన్ని అగ్నికి ఆహుతి చేయండి. మీ మీ దేవుళ్లకు అండగా నిలబడండి"*** అని పిలుపు ఇచ్చారు.

## ఎంత విచిత్రమయిన పిలుపు ఇది!?

'దేవుడు చేసిన మనుషులు' దైవం గురించి ఇచ్చే ఈ పిలుపులో దేవుని నిస్సహాయ స్థితి కొట్టొచ్చినట్లే కనిపిస్తోంది. మనిషి ఆగ్రహోదగ్ర స్థితికి లోనైనపుడు విజ్ఞతను, వివేచనను కోల్పో తాడు. తన స్థాయికి ఏమాత్రం శోభించని పిచ్చి వాగుడు వాగు తాడు. ఆధి భౌతికతత్వం పెనుభూతంలా పెనవేసుకుపోయిన 'అమీలు' అగ్రవర్ణం వారు ఆ క్షణంలో చేసింది కూడా అదే. ఎందుకంటే వారు ఆ కుర్రవాణ్ణి తమ దారి నుంచి తొలగించుకోక పోతే తమ స్వలాభాల కట్టడం కుప్పకూలిపోతుంది.

ఆ కాలపు చక్రవర్తి నమ్రూదు కోరుకున్నదీ అదే. తన అభిమతానికి ప్రభుత్వాధికారులు, మతాధిపతులు, సైన్యాధికారులు సయితం వత్తాసు పలికినపుడు ఇంక తనకు కావలసిందేముంది? ఎందు కంటే సాక్షాత్తూ దైవాంశ సంభూతుడుగా వెలిగిపోతున్న నమ్రూదు చక్రవర్తినే ఆ కుర్రవాడు ఎదిరించాడు. అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి ప్రశ్నాస్త్రాలు సంధించాడు. 'జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు' అని ఆ అబ్బాయి చెప్పినప్పుడు నమ్రూదు భృకుటి ముడివేశాడు. 'నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను కూడా కోరిన వారిని ప్రాణాలతో వదిలేస్తాను. నేను కోరిన వారి ప్రాణాలు తీస్తాను' అని చెప్పాడు నమ్రూద్. ఇబ్రాహీమ్(అ) ఏమాత్రం తొణ క్కుండా. 'అలాగా! సరే, నా ప్రభువు సూర్యుణ్ణి తూరుపు నుంచి ఉదయింపజేస్తున్నాడు. పడమటన అస్తమించేలా చేస్తు న్నాడు. మరి నువ్వు నిజదైవమే అయినట్లయితే సూర్యుణ్ణి పడమటి దిక్కున ఉదయించేలా చెయ్యి. తూర్పు దిక్కున అస్తమించేలా చెయ్యి చూద్దాం' అని సవాలు విసిరేసరికి నమ్రూదుకు దిమ్మ తిరిగినంత పనయింది.

## అగ్నిగుండంలో ఇబ్రాహీమ్ (అ)

ఈ విధంగా రాజు పంచన చేరినవారంతా ఏకమై తాగూత్ వ్యవ స్థను కాపాడుకోవడానికి నడుం బిగించారు. ఇబ్రాహీం(అ)ను అగ్నికి ఆహుతి చేయాలనే వారంతా సంకల్పించుకున్నారు. అతని కోసం ఓ పెద్ద అగ్నిగుండం తయారు చేయబడింది. ఆ విధంగా వారు తమ దేవుళ్ళకు 'సహాయం' చేయాలనుకున్నారు. వారి నరనరాన జీర్ణించుకుపోయిన అవిశ్వాసం, బహు దైవారాధన వారి మనోనేత్రాన్ని కాంతిహీనం చేసేసింది. అదే సమయంలో దేవుని కారుణ్య కడలి ఉప్పొంగింది. తన ప్రియతముని కోసం **'చల్లారిపో'** అని అల్లాహ్ అగ్నిని ఆజ్ఞాపించాడు. అంతేకాదు, అతని పాలిట **'సురక్షితం అవ్వు'** అని కూడా ఆదేశించాడు.

అంతే! ఆ అగ్నిగుండం ఇబ్రాహీమ్(అ) పాలిట నందనవనంగా పరిణమించింది. అందరూ కళ్ళప్పగించి చూస్తూ ఉండగానే ఆ అబ్బాయి ఆ అగ్నిగుండంలో నుంచి హాయిగా బయటికి నడిచి వచ్చాడు. ఈ అద్భుత సంఘటనకు నమ్రూద్ చక్రవర్తి సిగ్గుతో కుంచించుకుపోయాడు. కాని సత్యం కొరకు వాళ్ళ హృదయ కవాటాలు తెరుచుకోలేదు. ఆ గడ్డపై సత్యామృతాన్ని ఆస్వాదించే శుభాత్మలు లేవని ఆ అబ్బాయికి అర్థమైపోయింది. తన ఏక దైవారాధనా వాదానికి అనువైన మరో ప్రాంతానికి, మరో జాతి వైపునకు ప్రస్థానం చేయవలసిన తరుణం ఆసన్నమైందని అతను తెలుసుకున్నాడు. దైవాజ్ఞపై దేవుడు సూచించిన కన్ఆన్ ప్రదేశం వైపునకు వెళ్ళాలని సంకల్పించుకున్నాడు.

## దేవుడు సూచించిన ప్రదేశానికి


చెడు వాతావరణం నుండి శుభప్రదమైన వాతావరణం వైపునకు, చెడు సహచర్యం నుండి సద్వర్తనుల సహచర్యం వైపునకు, చెడు వ్యవస్థ నుండి సత్య ప్రధానమైన వ్యవస్థ వైపునకు ప్రయాణం సాగించారాయన.

హజ్రత్ ఇబ్రాహీమ్(అ) అక్కణ్ణుంచి వలసపోయిన తరువాత ఆ రాజ కుటుంబంపై, ఆ జాతి వారిపై ఎడతెగని ఆపదలు వచ్చి అది సర్వనాశనమైంది. తొలుత ఎలామీయులు (Elamites) 'ఉర్'ని నాశనం చేశారు. నమ్రూద్‌ను 'నన్నార్' విగ్రహాలతో సహా బందీగా చేసుకుని తీసుకెళ్ళిపోయారు. ఆ తరువాత 'లర్సా'లో ఎలామీయుల ప్రభుత్వం ఏర్పడింది. దానికి లోబడి 'ఉర్' సామంత రాజ్యంగా ఉండేది. చివరికి ఒక అరబీ కుటుంబం ఆధ్వర్యాన 'బాబిలోనియా' బలపడసాగింది. అప్పుడు 'లర్సా', 'ఉర్' రెండూ దాని అధీనంలోకి వచ్చాయి. ఈ వినాశాల కార ణంగా 'నన్నార్' దేవత పట్ల ఉర్ ప్రజల నమ్మకం వమ్మయింది. కారణం; అది వారిని కాపాడలేకపోవటమే.

దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఇచ్చిన పిలుపును చిన్న చూపు చూసిన బాబిలోనియా పాలకులు, పురోహితులు, పండి తులు, కళ్ళు మూసుకుని ఆ దుర్మార్గుల అడుగులకు మడుగు లొత్తిన ముష్రిక్ జనులు అందరూ ఈ లోకంలో పుట్టగతు ల్లేకుండా పోయారు. ఈ రోజు ప్రపంచంలో వారి నామరూపాల్లేవు.

అయితే -

దైవవాక్కు ఉన్నతికై నోరు విప్పాడన్న నేరంపై కాల్చిబూడిద చేసెయ్యాలని జనులు సంకల్పించుకున్న 'వ్యక్తి'ని మాత్రం అల్లాహ్ కీర్తిశేషునిగా మిగిల్చాడు. నాలుగు వేల సంవత్సరాలుగా ప్రపంచంలో అతని పేరు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ప్రళయం వరకూ వెలుగుతూనే ఉంటుంది. ప్రపంచంలోని ముస్లిములు, క్రైస్తవులు, యూదులు విశ్వప్రభువుకు 'ఖలీల్' (స్నేహితుడు) అయిన ఈ త్యాగమూర్తిని తమ నాయకునిగా ఆదరిస్తున్నారు. 40 శతాబ్దులుగా లోకానికి సన్మార్గ వెలుగు ప్రాప్తమయ్యిందంటే, అది ఆ మహా మనీషి ద్వారానే! ఆయన వంశంలో పుట్టిన సజ్జన సంతతి వల్లనే!! ఆయన అసాధారణ త్యాగాలకు పరలోకంలో మంచి ప్రతిఫలం ఎలాగూ లభిస్తుంది. అయితే ఇహలోకంలో కూడా ప్రపంచం వెనుక పరుగెత్తే వారెవ రికీ ప్రాప్తించని గౌరవోన్నతులు, కీర్తి ప్రతిష్టలు ఈ మహనీయునికి ప్రాప్తించాయి. ✤



# ఉర్దూ భాషపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

**సుప్రీంకోర్టు 14 ఏప్రిల్ 2025న ఒక చారిత్రాత్మక తీర్పునిచ్చింది.** మహారాష్ట్రలోని పాతూరు మున్సిపల్ కౌన్సిల్ సైన్ బోర్డుపై ఉర్దూ భాష కూడా ఉపయోగించడాన్ని సరైనదిగా ప్రకటించడమేగాక, ఇలా రాయడం గొప్ప భారతీయ సాంస్కృతిక వారసత్వంగా కొనియాడింది. జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ కేసును (వర్షాతాయి వర్సెస్ మహారాష్ట్ర) విచారించింది. ఈ సందర్భంగా అది భాష, సంస్కృతి, సోదరభావం గురించి లోతైన విలువల గురించి చెప్పింది. ఈ తీర్పు భారతీయ న్యాయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది.

## కేసేమిటి?

పాతూరు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వర్షాతాయి సంజయ్ బగాడే దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కేసు ప్రారంభమైంది. ఆమె మున్సిపల్ కౌన్సిల్ సైన్ బోర్డుపై ఉర్దూ భాష రాయడాన్ని వాడకాన్ని సవాలు చేశారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల (అధికార భాషలు) చట్టం 2022 ప్రకారం మరాఠీ భాషను మాత్రమే ఉపయోగించడం సరైనదని ఆమె వాదించారు. సుప్రీం కోర్టు ఈ వాదనను ఖండిస్తూ, పేర్కొన్న చట్టం లేదా మరే ఇతర చట్టపరమైన నిబంధన కూడా ఉర్దూ వాడకాన్ని నిషేధించదని స్పష్టం చేసింది.

జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ తమ తీర్పులో, భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడిన మరాఠీ, ఉర్దూ భాషలకు సమాన హోదా ఉందని పేర్కొన్నారు. సైన్ బోర్డుపై ఉర్దూ వాడకం స్థానిక ప్రజల సౌలభ్యం కోసం మాత్రమేనని, రాజకీయ లేదా మతపరమైన ఎజెండాలో అది భాగం కాదని కోర్టు నొక్కి చెప్పింది.

## భారత సాంస్కృతిక చిహ్నం ఉర్దూ

కోర్టు తీర్పు సందర్భంగా ఉర్దూ భాష చారిత్రక ప్రాముఖ్యతను ప్రస్తావించింది. ఉర్దూ భారత భూభాగంలో జన్మించిన ఇండో-ఆర్యన్‌భాష అని, శతాబ్దాల సాంస్కృతిక సమ్మేళనంలో అది వికసించిందని పేర్కొంది. వలస పాలకులు హిందీ, ఉర్దూ భాషల మధ్య కృత్రిమ విభజనను సృష్టించారని, హిందీని హిందువులతో, ఉర్దూను ముస్లింలతో ముడిపెట్టారని కోర్టు విచారం వ్యక్తం చేసింది. ఈ విభజన భాషలకు మతం రంగును పులిమిందని, ఇది దేశసమైక్యతకు, దేశంలోని వైవిధ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించింది.

## కోర్టు ఏమందంటే ...

**"ఉర్దూ ఉత్థాన పతనాలను వివరంగా చర్చించే సందర్భం కాదిది.**

**కానీ హిందీ, ఉర్దూ భాషల సమ్మేళనం అతివాదుల వైఖరి వల్ల దెబ్బతింది. హిందీ మరింత సంస్కృతీకరించబడింది, ఉర్దూ మరింత పర్షియన్‌తో నిండిపోయింది. వలస పాలకులు ఈ భాషా విభజనను మతం ఆధారంగా మరింతగా పెంచారు. హిందీని హిందువుల భాషగాను, ఉర్దూను ముస్లింల భాషగాను చూడటం మొదలయ్యింది. ఇది దురదృష్టకరమైన వక్రీకరణ"**

ఉర్దూ "విదేశీ" భాష కాదని, భారత భూభాగంలోనే ఉర్దూ మూలాలు ఉన్నాయని, వివిధ సంస్కృతుల సమ్మేళనం వల్ల ఈ భాష ఉనికిలోకి వచ్చిందని, కాలానుగుణంగా కవిత్వం, సాహిత్యం, సంస్కృతుల ఉన్నత భాషగా మారిందని కోర్టు స్పష్టం చేసింది. గొప్ప గొప్ప కవులు ఈ భాషలో రాసి మహోన్నత శిఖరాలకు తీసుకెళ్ళారని చెప్పింది.

## కలిపే వంతెన ఇది, వేర్పాటు గోడ కాదు

భాష లక్ష్యం ప్రజలను విభజించడం కాదని, ప్రజలను కలపడమని సుప్రీం కోర్టు నొక్కి చెప్పింది. పాతూరులోని స్థానిక ప్రజల్లో ఉర్దూ భాషీయులు ఉంటే సైన్ బోర్డుపై మరాఠీతో పాటు ఉర్దూను ఉపయోగించడం చట్టబద్ధమే కాదు, ప్రజల సౌలభ్యం కోసం అది అవసరమని కోర్టు పేర్కొంది. మున్సిపల్ కౌన్సిల్ 1956 నుండి ఉర్దూను ఉపయోగిస్తోందని, స్థానిక ప్రజలకు అది బాగా తెలిసిన భాష అని కోర్టు పేర్కొంది.

సైన్ బోర్డు గురించిన నిర్ణయం చీఫ్ ఆఫీసర్ అధికార పరిధిలోకి వస్తుందని, కౌన్సిలర్ అధికార పరిధిలో లేదన్న వర్షాతాయి అభ్యంతరాలు చట్టపరంగా సరయినవి కావని కూడా కోర్టు స్పష్టం చేసింది. గతంలో బాంబే హైకోర్టు కూడా 2021లో ఇదే పిటిషన్‌ను తిరస్కరించింది, ఆ తర్వాత ఈ కేసు సుప్రీం కోర్టుకు చేరుకుంది.

## ఉర్దూ - భారతీయ న్యాయ వ్యవస్థ

జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ తమ తీర్పులో ఉర్దూ భాష భారతీయ న్యాయ వ్యవస్థలో కూడా అంతర్భాగమని ఒక అద్భుత పరిశీలనను అందించారు.

**"దివాని చట్టం లేదా క్రిమినల్ చట్టం ఏదైనా కావచ్చు, కోర్టుల భాషలో ఉర్దూ పదాల ప్రభావం చాలా ఉంది. 'అదాలత్', 'హల్ఫ్‌నామా', 'పేషి' వంటి పదాలు ఉర్దూ ప్రభావానికి స్పష్టమైన ఉదాహరణలు" అన్నారు.**

ఉర్దూ కేవలం రోజువారీ జీవితంలోనే కాదు, భారత న్యాయవ్యవస్థ, సాంస్కృతిక నిర్మాణంలో కూడా అంతర్భాగంగా ఉందని ఈ మాటలు నిరూపిస్తున్నాయి.

## గంగా జమునా తహ్‌జీబ్

ఉర్దూను గంగా జమునా తహ్‌జీబ్‌ను చాటి చెప్పే ప్రకాశవంతమైన ఉదాహరణగా పేర్కొంటూ, ఇది ఉత్తరభారతం, మధ్య భారతాల ఉమ్మడి సాంస్కృతిక చిహ్నమని కోర్టు పేర్కొంది. భాష మతానికి చెందినది కాదని, దేశం, ప్రాంతం, ప్రజలకు చెందినదని కోర్టు నొక్కి చెప్పింది.

> **"భాష మతం కాదు, భాష మతానికి ప్రాతినిధ్యం వహించదు. భాష సాంస్కృతిక చిహ్నం. భాష ఒక దేశమూ, అక్కడి ప్రజల నాగరిక అభివృద్ధికి కొలమానం."**

ఈ తీర్పు కేవలం ఉర్దూ గురించి మాత్రమే కాదు, భారతదేశ వైవిధ్యం, దేశంలో సౌభ్రాత్ర స్ఫూర్తిని విడమరిచి చెప్పిన తీర్పు. భాషలకు సంబంధించిన పక్షపాతాలు, అపోహలను వాస్తవాల గీటురాయిపై పరిశీలించాలని కోర్టు పేర్కొంది.

కోర్టు తన తీర్పును బలమైన సందేశంతో ముగించింది:

> **"భాషల గురించి మన అపోహలు లేదా బహుశా పక్షపాతాలను మనదేశంలోని గొప్ప వైవిధ్యపుటద్దంలో పరిశీలించాలి. మన బలం మన బలహీనత కాకూడదు. ఉర్దూయే కాదు ప్రతి భాషతో స్నేహం చేద్దాం."**

ఈ మాటలను కేవలం తీర్పులో భాగంగా మాత్రమే చూడరాదు. మనం భాషలను విభజన గోడలుగా కాదు, మనుషులను కలిపే వంతెనలుగా మార్చుకుని సమైక్యంగా ఉండాలన్న గొప్ప సందేశం ఉన్న వ్యాఖ్యాలివి.

**(బార్ అండ్ బెంచ్ సౌజన్యం..**

**అనువాదం: ముఫ్తీ నవీద్ సైఫ్ అడ్వకేట్)**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

# ముస్లిమ్ ఆదర్శ దినచర్య

**గత సంచిక తరువాయి**

అల్లాహ్‌ను విశ్వసిస్తున్నాను, ప్రవక్త(స) వారిని ప్రేమిస్తు న్నాను అని కూతలకు పరిమితమయిన కోతలరాయుళ్ల గురించి అల్లామా ఇక్బాల్ (రహ్మ) చెప్పిన కవిత గమనార్హం!

**తబ ఆజాద్ పే నమాజ్ ఫజ్ర్ భారీ హై**

**హమ్ సే కబ్ ప్యార్ హై హా నీన్ద్ తుమ్హే ప్యారీ హై**

నేడు మన పరిస్థితి ఎంతటి స్థితికి దిగజారిందంటే, ఇతర సముదాయాలు మనల్ని ఆలస్యంగా మేల్కొనే సముదాయంగా పరిగణించడం ప్రారంభించాయి. ఒక మహిళ తన కొడుకుతో ఇలా అంటుంది: బాబూ! ఉదయాన్నే లే! ముస్లింల మాదిరిగా ఏడు గంటల వరకు నిద్రపోకు. అల్లాహ్ మన పరిస్థితిపై దయ చూపుగాక!

**గుజర్ గయీ నమాజె ఫజ్ర్ ఔర్ తూ సోతా రహా**

**ఖీమతీ వక్త్‌కు ఖాబోమే ఖోతా రహా**

**సుబహ్ నమూదార్ హువి ఔర్ తూ బేదార్ న హువా**

**ఉమర్ భర్ సోకర్‌భీ తూ బేజార్ న హువా**

ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ) ఇలా అన్నారు: అల్లాహ్ తన అనుగ్రహాన్ని ఎవరి పైనైనా కురిపించదలచినప్పుడు, ఆయన అతని కోసం వినయ విధేయతల, అణకువ, నమ్రత, సౌమ్యతల ద్వారాలు తెరుస్తాడు. అతను ఎలాంటి అవస్థలోనయినా తనను మాత్రమే ఆశ్రయించేలా దీవిస్తాడు, అతను తనలోని లోపాలు, వైకల్యాలు, వైఫల్యాలను, అజ్ఞానం, అవిధేయతను గుర్తించేలా చేస్తాడు. అది అతనికి తన ప్రభువు అపారమైన దయ, ఆశీర్వాదం, కరుణ, అనుగ్రహం, దీవెనల మహత్యాన్ని, ఘనతను గ్రహించడానికి, నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకోవడానికి అతనికి కావాల్సినంత శక్తిని, యుక్తిని ఇస్తుంది.

సజ్జనులలో ఒకరు ఇలా అన్నారు: “నేను నా అవసరాన్ని తీర్చమని అల్లాహ్‌ను కోరినప్పుడు, ఆయన దానిని నెరవేర్చితే నేను ఒకింత సంతోషిస్తాను. ఆయన వెంటనే తీర్చకపోతే నేను మరింతగా ఆనందిస్తాను. ఎందుకంటే ఇది నా ఎంపిక, అది అగోచరాలన్నీ తెలిసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఎంపిక”.

## ఫజ్ర్ నమాజ్ అనంతరం ఈ అద్భుత దుఆ తప్పక చేయాలి

ఒకసారి దైవప్రవక్త(స) ఫజ్ర్ నమాజ్ కోసం మస్జిదుకు బయలు దేరుతున్నప్పుడు జువైరియా (రజి. అన్హా) తాను నమాజ్ చేసుకునే చోట కూర్చొని (దైవధ్యానంలో నిమగ్నులై) ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) బాగా ప్రొద్దెక్కిన తరువాత (మస్జిద్ నుండి) ఇంటికి తిరిగొచ్చారు. ఆమె అప్పటి వరకు అక్కడే కూర్చొని ఉన్నారు. ఆమెను చూసి దైవప్రవక్త (సల్లం), “నేను మస్జిద్‌కు వెళ్ళినప్పటి

నుండి నువ్వు ఇక్కడే కూర్చుని ఉన్నావా?'' అని అడిగారు. “అవును, దైవప్రవక్తా!'' అని సమాధాన మిచ్చారు జువైరియా (రజి. అన్హా). అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: నేను నీ దగ్గరి నుండి వెళ్ళిన తరువాత నాలుగు వచనాలు ఒక్కొక్కటి మూడు సార్లు చొప్పున పఠించాను. వాటిని గనక ఈ రోజు నువ్వు చేసినా అల్లాహ్ ధ్యానంతో తూచితే అవే ఎక్కువ బరువును తూస్తాయి. ఆ వచనాలు:

1) సుబ్హానల్లాహి వ బిహమ్దిహీ అదద ఖలిఖిహీ 2) సుబ్హాన ల్లాహి రిజా నఫ్సిహీ 3) సుబ్హానల్లాహి జినత అర్షిహీ 4) సుబ్హానల్లాహి మిదాద కలిమాతిహీ (ఇలా 3 సార్లు).

(సహీహ్ ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : రెండు వచనాలున్నాయి. అవి పలకటానికి చాలా తేలికగా ఉంటాయి. కాని త్రాసులో మాత్రం చాలా బరువుని తూస్తాయి. ఇంకా అవి కరుణామయునికి చాలా ప్రియమైనవి. అవే 'సుబ్హానల్లాహి వబిహమ్దిహీ సుబ్హానల్లాహిల్ అజీమ్' (బుఖారీ-ముస్లిం)

అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) తెల్లవారి నప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు: (ఉదయం:) “అల్లాహుమ్మ బిక అస్బహ్నా వ బిక అమ్సైనా వ బిక నహ్యా వ బిక నమూతు వ ఇలైక న్నుషూర్''. (అబూ దావూద్)

అయిదు పూటలా ఫర్జ్ నమాజు తర్వాత క్రింద పేర్కొనబడిన సూరాలు చదవడం అలవాటు చేసుకోవాలి. ఫజ్ర్, మగ్రిబ్ తర్వాత 3 సార్లు, జుహ్ర్, అస్ర్, ఇషా తర్వాత ఒక్కోసారి చదవాలి. దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు : “ఖుల్ హువల్లాహు అహద్...'', “ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్...'', “ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్...'' (ఈ మూడు సూరాలూ 3 సార్లు) పఠించు. అన్ని రకాల కష్టాల నుండి సురక్షితంగా ఉంటావు'' అని అన్నారు. (తిర్మిజీ-హసన్)

వీటితోపాటు ఆయతుల్ కుర్సీ ఉదయం సాయంత్రాలతో పాటు అయిదు పూటలా నమాజు తర్వాత చదవడం చాలా మంచిది.

**అల్లాహు లా ఇలాహ ఇల్లా హువల్ హయ్యుల్ ఖయ్యూము లా త ఖుజుహూ సినతువ్ వ్వలా నౌమున్ ల్లహూ మా ఫిస్సమావాతి వమా ఫిల్అర్జి, మన్ జల్లజీ యష్ ఫవూ ఇన్ దహూ ఇల్లా బి ఇజ్నిహీ య - లము మా బైన అయదీహిం వమా ఖల్ ఫహుం వలా యుహీతూన బిషయ్యిమ్మిన్ ఇల్మిహీ ఇల్లా బి మాషాఅ వసి అకుర్ సియ్యుహు స్సమావతి వల్అర్జ వలా య ఊదుహూ హిఫ్ జుహుమా వహువల్ అలియ్యుల్ అజీం (ఖుర్ఆన్ 2:255).**

అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త ప్రవచించారు : “ఎవరు ప్రతి నమాజు తర్వాత ఆయతుల్ కుర్సీ చదువుతారో వారి స్వర్గ ప్రవేశానికి మరణమే అడ్డు''

(సహీహ్ నసాయీ)

ఉదయం ఆయతుల్ కుర్సీ చదివినవారు సాయంకాలం వరకు మరియు సాయంకాలం చదివినవారు ఉదయం వరకు షైతానుల నుండి రక్షింపబడతారు. (హాకిం)

పడకపై వెళ్ళి ఆయతుల్ కుర్సీ చదివినవారిపై అల్లాహ్ ఒక రక్షకుడ్ని నియమిస్తాడు మరియు తెల్లారే వరకు షైతాన్ అతని దగ్గరికి రాడు. (బుఖారి)

## ఫజ్ర్ తర్వాత ఖుర్ఆన్ పారాయణం

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది'' అంటే ఫజ్ర్ వేళ అల్లాహ్ దూతలు దివి నుండి భువికి దిగివస్తారు. (సహీహ్ తిర్మిజీ, సహీహ్ ఇబ్నుమాజా)

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: “ప్రజలలో కొంత మంది అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉన్నారు .'' అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు. యా రసూలల్లాహ్! వారెవరూ? అని కొందరు అడిగారు. దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): “వారు అహ్‌లుల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ (గంథాన్ని పారాయణం చేసేవారు, దానిని నేర్పేవారు, నేర్చుకునేవారు). వారే అల్లాహ్‌కు అతి దగ్గరవారై ఉంటారు, వారు ఆయనకు ప్రత్యేకులు'' అని అన్నారు. (నసాయి, ఇబ్ను మాజా, హాకిమ్: సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్)

హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “మీలో ఖుర్ఆన్ నేర్చుకొని ఇతరులకు నేర్పించినవారే అందరికంటే ఎక్కువగా మేళ్లు కలిగి ఉన్నవారు.'' (బుఖారీ)

## చాప్త్ నమాజ్

ఇది అభిలషణీయమైన నఫిల్ నమాజ్, అల్లాహ్ సాన్నిహిత్యాన్ని పొందే ఉద్దేశ్యంతో ఆచరించటం ప్రవక్త (స) సంప్రదాయం, సాధారణంగా ప్రవక్త(స) దీన్ని ఆచరించేవారు. ఇది మూడు వందల అరవై దాన ధర్మాలకు సమానం. (ముస్లిమ్)

అతి తక్కువ అంటే రెండు రకాతులు అతి ఎక్కువ అంటే 8 రకాతులు చేయవచ్చును. (తిర్మిజి, సహీహ్)

నమాజుకు చాలా ప్రాముఖ్యత ఉంది ప్రవక్త(స) ఆదేశం: అల్లాహ్ ఇలా ఆదేశిస్తాడు : ఓ ఆదమ్ కుమారా! దిన ప్రారంభంలో నా కొరకు నాలుగు రకాతులు చదువు సాయంత్రం వరకు నేను నీ సమస్యలన్నిటికి పరిష్కారంగా ఉంటాను (తిర్మిజి)

## దివారాత్రుల్లో 12 రకాతుల సున్నతె ముఅక్కిద

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పగా నేను విన్నానని ఆయన సతీమణి ఉమ్మె హబీబా (రజియల్లాహు అన్హా) ఉల్లేఖించారు: ''ముస్లిం దాసుడు ప్రతి రోజూ ఫర్జ్ నమాజు కాకుండా పన్నెండు రకాతుల నఫిల్ నమాజు అల్లాహ్ కొరకు చేస్తూ ఉంటే అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఒక ఇల్లు నిర్మిస్తాడు. లేక ఒక ఇల్లు అతని కొరకు నిర్మించబడుతుంది''. (ముస్లిం)

## సలాతుత్తస్బీహ్

సలాతుత్తస్బీహ్ గురించి ప్రామాణిక హదీసుల్లో పేర్కొనడం జరిగింది. ఒకసారి ప్రవక్త (స) అబ్బాస్ (ర)తో ఇలా అన్నారు. చిన్నాన్నగారూ! నేను మీకు ఒక ముఖ్య ఆరాధనను గురించి బోధిస్తాను. దాన్ని ఆచరిస్తే అల్లాహ్ (త) మీ పాపాలన్నింటినీ అంటే చేసినవి, ఇంకా చేయనివి, పాతవి, కొత్తవి, పొరపాటున చేసినవి, కోరిచేసినవి, పెద్దవి చిన్నవి, రహస్యంగా, బహిరంగంగా చేసినవి మొదలైన వాటన్నింటినీ క్షమించివేస్తాడు.

సలాతుత్తస్బీహ్ చదివే పద్ధతి: నాలుగు రకాతులు చదవాలి. ప్రతీ రకాతులో సూరహ్ ఫాతిహా పఠించాలి. సూరహ్ ఫాతిహా తరువాత ఏదైనా సూరహ్ పఠించాలి.

సుబ్హానల్లాహ్, వల్ హము లిల్లాహ్, వలాయిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అని 15 సార్లు పఠించండి. ఆ తరువాత రుకూలోకి వెళ్లండి. రుకూలో ఈ నాలుగు పదాలనే 10 సార్లు పఠించండి. ఆ తరువాత రుకూ నుండి తల ఎత్తి వీటినే 10 సార్లు పఠించండి. ఆ తరువాత సజ్దాలో వెళ్లి 10 సార్లు పఠించండి. ఆ తరువాత సజ్దా నుండి తల ఎత్తి 10 సార్లు పఠించండి. ఆ తరువాత సజ్దాలోకి వెళ్ళి 10 సార్లు పఠించండి. ఆ తరువాత సజ్దా నుండి తల ఎత్తి 10 సార్లు పఠించండి. ఇవన్నీ ఒక రకాతులో పఠించబడే తస్బీహ్‌లు మొత్తం 75 అవుతాయి. ఇదే విధంగా 4 రకాతుల్లోనూ పఠించండి. మీకు సాధ్యమైతే రోజుకు ఒక్కసారైనా చదవండి. రోజు చదివే తీరికలేకపోతే ప్రతి శుక్రవారం చదవండి. ప్రతి శుక్రవారం కూడా వీలు లేకపోతే సంవత్సరానికి ఒక్క సారైనా చదవండి. సంవత్సరానికి ఒక్క సారైనా వీలు కాకపోతే జీవితంలో ఒక్క సారైనా చదవండి. (అబూదావూద్ సహి 1297, తిర్మిజి సహిహ్ 481, 482)

## ఖైలూలా చేయడం ప్రవక్త (స) సంప్రదాయం

మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, వీలైతే, కాసేపు మేనువాల్చి కునుకు (ఖైలూలా) తీయాలి. అది రాత్రి ప్రార్థన చేయడంలో మంచిగా సహకరిస్తుంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు: ''ఖైలూలా చేయండి , ఎందుకంటే షైతాను ఖైలూలా చెయ్యడు'' (సహీహ్ అల్-జామీ')

## అస్ర్‌కు ముందు నాలుగు రకతులు

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ''అస్ర్‌కు ముందు నాలుగు రకాతులు చేసేవారిని అల్లాహ్ కరుణించు గాక!'' అని దీవించారు. (అబూదావూద్, తిర్మిజీ-హసన్)

## విద్యార్జన అవశ్యం

మీ ప్రాపంచిక కార్యకలాపాల నుండి కొంత సమయం తీసి జ్ఞాన సముపార్జనలో వెచ్చించాలి. ఈ రోజు మనం విద్యార్జనను పిల్లల పనిగా భావించడం విచారకరం! జ్ఞానాన్ని సముపార్జించడం ప్రతి ముస్లిం (స్త్రీ పురుషుల)పై తప్పనిసరి విధి. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలియజేశారు: ప్రపంచం పాపిష్టిది, ప్రపం చంలో ఉన్నదంతా పాపిష్టిదే- దైవ ధ్యానం, దానికి సంబంధించినవి, ఇంకా ధర్మజ్ఞాని, జ్ఞానార్థి తప్ప! (తిర్మిజీ-హసన్)

## తోటి ముస్లింల అవసరాలను తీర్చడం

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు: (విశ్వాసులారా!) మేలు చేయండి. బహుశా దీని ద్వారానే మీరు సాఫల్యం పొందవచ్చు. (హజ్జ్: 77)

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉద్బోధించారు : ముస్లిం ముస్లింకు సోదరుడు. ఒక ముస్లిం తోటి ముస్లింపై (ఎన్నటికీ) దౌర్జన్యం చేయడు, అతన్ని నిస్సహాయుడిగా వదలిపెట్టడు. (ఒక ముస్లిం) తన సోదరుని అవ్ఎటన్త్రసరాలు తీర్చే పనుల్లో (నిమగ్నుడై) ఉంటే అల్లాహ్ అతని అవసరాలు తీరుస్తూ ఉంటాడు. ఎవరైనా ముస్లింను ఒక కష్టం నుంచి కాపాడితే, ప్రళయదినాన దేవుడు అతనికి ఎదురయ్యే కష్టాల్లోని ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. ఎవరైనా ఒక ముస్లిం (వల్ల జరిగిన పొరపాట్ల) పై పరదా వేస్తే దేవుడు కూడా ప్రళయ దినాన అతని (తప్పుల్ని) మరుగు పరుస్తాడు. (బుఖారీ- ముస్లిం)

**(మిగతా వచ్చేవారం)**




**అల్లాహ్ మానవుణ్ణి మట్టితో సృష్టించాడు.** బలమైన ఎముకలు, రక్తమాంసాలు, ఆలోచించే శక్తి, మాట్లాడటం కలిగిన మానవునికి ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. మానవుని మనసులో ప్రేమ, దయ, జాలి, సానుభూతి, ద్వేషం, ధైర్యం, కోపం, అసూయ, అహంకారం వంటి వివిధ భావోద్వేగాలు కలగలసి ఉంటాయి. మనిషిలో కోపం ఒక భావోద్వేగం.

"తన కోపమే తన శత్రువు తన శాంతమే తనకు రక్ష" అన్న సుమతి శతకంలోని సూక్తి మనందరికీ తెలిసిన విషయమే.

దైవభీతి కలవారి గురించి అంతిమ దైవగ్రంథం ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "వారు కోపాన్ని దిగమింగే వారు, ఇతరుల తప్పులను క్షమించేవారు. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం" (దివ్య ఖుర్ఆన్ 3: 134)

బాగా కోపం వచ్చినప్పుడు వారు ఆవేశంలో ఊగిపోకుండా దాన్ని లోలోపలే అణచుకుంటారు. అగ్రహంలోనూ నిగ్రహాన్ని ప్రదర్శిస్తారు. కసి తీర్చుకోగల అవకాశం ఉండి కూడా తమను తాము కట్టి పడేసుకుకుంటారు. పైగా తమకు కోపం తెప్పించిన వారిని మన్నించి పొమ్మంటారు. కోపోద్రేకాలను గురించి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు :

"మీలో ఎవరికైనా నిలబడి ఉన్నప్పుడు కోపం వస్తే అతను వెంటనే కూర్చోవాలి. దానివల్ల కోపం చల్లారితే సరి. లేకుంటే పడుకోవాలి." (మిష్కాత్)

"కోపం షైతాన్ ప్రేరణతో వస్తుంది. షైతాన్ నిప్పుతో సృజించబడ్డాడు. నిప్పు నీటితో చల్లారుతుంది. కనుక మీరు కోపం వచ్చినప్పుడు వుజూ చేయండి." (అబూదావూద్)

"కుస్తీ పట్టి ఇతరులను చిత్తు చేసేవాడు పరాక్రమశాలి కాడు. ఆగ్రహం వచ్చినప్పుడు తనను తాను నిగ్రహించుకునేవాడే నిజమైన పరాక్రమశాలి." (బుఖారీ, ముస్లిమ్)

"ఎవరు తన నోటిని రక్షించుకుంటాడో అల్లాహ్ అతని లోటుపాట్లను కప్పి పుచ్చుతాడు. ఎవరు తన కోపాన్ని నిగ్రహించుకుంటాడో అల్లాహ్ ప్రళయదినాన అతని బాధను పూర్తిగా తొలగిస్తాడు." (మిష్కాత్)

"ఎవరు తన కోపాన్ని అణచుకుంటాడో అల్లాహ్ అతనికి విధించే తన శిక్షను నిలిపివేస్తాడు." (తిబ్రాని)

"కోపం ప్రదర్శించే శక్తి ఉండి కూడా కోపాన్ని దిగమింగేవాడ్ని అల్లాహ్ ప్రళయదినాన సృష్టిరాశులందరి ముందు పిలిచి (స్వర్గంలోని) విశాలాక్షులైన సుందరాంగుల్లో నీకు నచ్చిన సుందరాంగిని ఎంపిక చేసుకోవచ్చు" అంటాడు.

ఒకతను దైవప్రవక్త(స) దగ్గరికి వచ్చి నాకేమైనా ఉపదేశించండి అని అడిగాడు. దానికి ఆయన కోపగించుకోకు అన్నారు. అతను అనేకసార్లు అదే ప్రశ్న అడిగాడు. ప్రతిసారి ఆయన కోపగించుకోకు అనే తాకీదు చేశారు. (బుఖారీ)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రవచనంలో విశ్వాసి నైజానికి సంబంధించిన మూడు సుగుణాలు ఉన్నాయి.

1) విశ్వాసికి కోపం వచ్చినప్పుడు అతని కోపం అతడ్ని అధర్మం, అక్రమాల వైపునకు పోనివ్వదు.

2) విశ్వాసికి సంతోషం కలిగినప్పుడు ఆ సంతోషం అతడ్ని సత్యం నుండి బయటికి తీసుకుపోదు.

3) విశ్వాసి శక్తిమంతుడు అయినప్పుడు అతను ఇతరులను (అంటే బలహీనులను) దోచుకోడు. (మిష్కాత్)

వైద్యశాస్త్రం రీత్యా కూడా తరచూ కోపం ప్రదర్శించేవారికి బీపి పెరిగి హృద్రోగాలు వస్తాయి. చరిత్ర పుటలు తిరగేస్తే ప్రపంచంలో జరిగిన ఎన్నో అనర్థాలకు ఆగ్రహమే మూలంగా కనిపిస్తుంది. అందుకే పెద్దలు అంటారు "కోపం వద్దు... సహనం ముద్దు" అని.




## వక్ఫ్ చట్టంపై పిటిషన్లు.. మే 15కి విచారణను వాయిదా వేసిన సుప్రీంకోర్టు..

కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసు విచారణను మే 15న జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఎదుట ప్రస్తావించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. త్వరలోనే జస్టిస్ బీఆర్ గవాయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పిటిషన్లు కొత్త సీజేఐ ధర్మాసనం ఎదుట విచారించాలని నిర్ణయించింది. ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా ఈ నెల 13న పదవీ విరమణ చేయనున్న విషయం తెలిసిందే. వక్ఫ్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 70 పిటిషన్లు దాఖలయ్యాయి. ఇప్పటికే కేసును సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. ఏప్రిల్ 17న సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మే 5వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సమయంలో చట్టంలోని రెండు వివాదాస్పద నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం హామీ ఇచ్చింది. వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అలాగే, వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించొద్దని కేంద్రాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## రూహ్ అఫ్జా లక్ష్యంగా రూపొందించిన కొత్త వీడియోను తొలగించాలని పతంజలిని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు!

హమ్‌దర్ద్ లాబొరేటరీస్ ప్రసిద్ధ వేసవి పానీయం రూహ్ అఫ్జాను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కొత్త ప్రమోషనల్ వీడియోను వెంటనే తొలగించాలని ఢిల్లీ హైకోర్టు పతంజలి ఆయుర్వేద్, సహ వ్యవస్థాపకుడు బాబా రాందేవ్‌లను ఆదేశించింది. తన మునుపటి ఆదేశాన్ని పదేపదే ఉల్లంఘించినందుకు కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని రామ్‌దేవ్‌కు కఠినమైన హెచ్చరిక కూడా జారీ చేసింది. చట్టపరమైన జోక్యం తర్వాత మునుపటి వీడియోను తొలగించినప్పటికీ, పతంజలి ఇలాంటి వాదనలను పునరావృతం చేస్తూ కొత్త వీడియోను అప్‌లోడ్ చేసిందని హమ్‌దర్ద్ కోర్టును ఆశ్రయించిన తర్వాత ఈ ఆదేశం వచ్చింది.

## 'కశ్మీరీలు, ముస్లింలపై దాడి చేయకండి'.. పహల్గామ్ ఉగ్రదాడిలో చనిపోయిన నేవీ అధికారి భార్య విజ్ఞప్తి!

పహల్గామ్ ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన నేవీ ఆఫీసర్ భార్య హిమాన్షి ముస్లింలపై కీలక వ్యాఖ్యలు చేశారు. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ జయంతి సందర్భంగా, శాంతి, ఐక్యత కోసం ఆయన భార్య హృదయపూర్వక విజ్ఞప్తి చేశారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆమె మాట్లాడుతూ ఈ విషాదం తర్వాత ముస్లింలను, కశ్మీరీలను నిందించవద్దని ఆమె దేశ ప్రజలను కోరారు. "మనం ముస్లింలను లేదా కశ్మీరీలను లక్ష్యంగా చేసుకోకూడదు. మాకు శాంతి కావాలి, న్యాయం కావాలి. ద్వేషం, విభజనకు ముగింపు పలకాల"ని పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు 1.50 లక్షల వరకూ ఉచిత వైద్యం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత ఉచిత చికిత్సను అందించడానికి వీలుకల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసింది. ప్రమాదం జరిగిన ఏడు రోజుల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశిత ప్రమాణాలు కలిగి, నమోదైన ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స పొందవచ్చు. పోలీసులు, ఆసుపత్రులు, స్టేట్ హెల్త్ ఏజెన్సీల సహకారంతో 'రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం 2025'ను జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) అమలు చేస్తుంది. రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

## అమరుడి భార్యపై ట్రోలింగ్

నేవీ అధికారి వినయ్ నర్వాల్ భార్య హిమాన్షీపై సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోలింగ్ జరుగుతోంది. కాగా.. ఈ అంశంపై జాతీయ మహిళా కమిషన్ జోక్యం చేసుకుంది. ట్రోలింగ్‌ని ఖండించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుబడుతూ ట్రోల్ చేయడం సరికాదని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. "లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ మరణం తర్వాత ఆమె భార్య హిమాన్షీపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ దురదృష్టకరం. దీన్ని ఖండిస్తున్నాం. ఆమె వ్యాఖ్యలు చాలా మందికి నచ్చకపోవచ్చు. ఆమె వ్యాఖ్యలను అంగీకరించనప్పటికీ, అసమ్మతిని ఎల్లప్పుడూ మర్యాదగా, రాజ్యాంగ పరిమితుల్లోనే వ్యక్తపరచాలి. ఒక మహిళను ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదు. ఆ మహిళ వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదు'' అని జాతీయ మహిళా కమిషన్ సోషల్ మీడియా ఎక్స్ లో పోస్టు చేసింది.

## గాజాలో దాడుల కంటే.. ఆకలికి తట్టుకోలేక చనిపోతున్నవారే ఎక్కువ

గాజాపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు పాల్పడుతూనే ఉంది. ఈ దాడుల వల్ల ఇప్పటికే వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. తాజాగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల వల్ల 40 మంది పాలస్తీనియన్లు మృతి చెందారనీ, 125 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. కాగా, ఇజ్రాయిల్ సైన్యం దాడుల వల్ల మరణించినవారు కొందరైతే.. ఆకలికి తట్టుకోలేక మరెంతో మంది చనిపోతున్నారని మీడియా వెల్లడించింది. ప్రస్తుతం దాదాపు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు సుమారు 3,500 మంది మృత్యువుకు చేరువలో ఉన్నారు. మరోవైపు ఆహార సరఫరాని ఇజ్రాయిల్ సైన్యం అడ్డుకోవడం వల్ల 290,000ల మంది చావుబ్రతుకుల్లో ఉన్నారని గాజా మీడియా తెలిపింది.

## ఫాస్ట్ ఫుడ్స్ ఎక్కువ తింటే అకాల మృత్యువే.. జాగ్రత్త

మోడరన్ ఫుడ్ హేబిట్స్ అర్థాంతరంగా కొంపలు ముంచేటట్టు కనిపిస్తున్నాయి. ఫాస్ట్ ఫుడ్స్ తినకండి మొర్రో అని పిల్లల్ని, యువకుల్ని ఎంత వారించినా ఆగడంలేదు. సాంప్రదాయ తిండ్లు, భోజనాలు పక్కన పెట్టేసి పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, చికెన్ లాలీపాప్స్ ఇలా కొత్త తరహా రెడీమేడ్ లేదా జంక్ ఫుడ్స్‌కు బాగా అలవాటు పడిపోతున్నారు నేటి తరం. అయితే, ఎక్కువగా ఇలాంటి ఫుడ్స్ తినడం వల్ల అకాల మృత్యువు సంభవిస్తుందని తాజా అధ్యయనంలో తేలింది. అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలు అకాల మరణాలకు కారణమవుతాయని ఆధారాలతో సహా చూపించింది. ఎనిమిది దేశాల (ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చిలీ, కొలంబియా, మెక్సికో, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్) నుండి ఆహార సర్వేలు, మరణాల డేటా నుండి డేటాను విశ్లేషించి అధ్యయనం చేసి ఈ నివేదిక తయారు చేశారు. సదరు డేటా ప్రకారం, అల్ట్రా-




ప్రాసెస్డ్ ఆహారాలు (UPFలు) తీసుకోవడం వల్ల అకాల మరణాలు చాలా ఎక్కువ సంభవిస్తున్నాయని సదరు అధ్యయనంలో తేలింది. అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార పదార్థాల అధిక వినియోగం 32 వేర్వేరు వ్యాధులతో ముడిపడి ఉందని కూడా ఆ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాదు, ఫాస్ట్ ఫుడ్స్ అధికంగా తినడం వల్ల హృదయ సంబంధ వ్యాధులు (గుండె జబ్బులు), ఊబకాయం, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్, డిప్రెషన్‌తో సహా 32 విభిన్న వ్యాధులు వచ్చే అవకాశం ఉందట. తీసుకునే ఆహారాలలో వస్తున్న మార్పులు, రెడీమేడ్ ఫుడ్‌లలో వాడే రంగులు, కృత్రిమ రుచులు, స్వీటెనర్లు, ఎమల్సిఫైయర్లు, అనేక ఇతర ఆర్టిఫిషియల్ ఫ్లేవర్స్ వల్ల మానవ శరీరానికి చాలా ముప్పు ఉంటుందని చెబుతున్నారు. కృత్రిమ పదార్థాల వాడకం కారణంగా బాడీలో సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్, చక్కెర స్థాయిలు బాగా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఎల్సెవియర్ ప్రచురణ సంస్థ ముద్రించిన, అమెరికన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అధ్యయనంలో దీనికి సంబంధించి సమగ్ర వివరాలు పొందుపరిచారు.

## కెనడా ప్రధానిగా కార్నీ

కెనడా సార్వత్రిక ఎన్నికల్లో మార్క్ కార్నీ నేతృత్వంలోని అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. మొత్తం 343 స్థానాలున్న కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 172 స్థానాలు అవసరం. అయితే ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం, లిబరల్ పార్టీ 168 చోట్ల విజయం సాధించింది. ఇంకా ప్రత్యేక బ్యాలెట్లలోని ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఒకవేళ లిబరల్ పార్టీ మెజారిటీ సాధించనప్పటికీ మార్క్ కార్నీ మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.

## జెరూసలేం సమీపంలో భారీ కార్చిచ్చు : ఇజ్రాయెల్‌లో జాతీయ అత్యవసర పరిస్థితి!

ఇజ్రాయెల్‌లో కార్చిచ్చు చెలరేగింది. జెరూసలేం పశ్చిమ కొండలలో వేగంగా వ్యాపించే కార్చిచ్చులు సంభవించడంతో ఇజ్రాయెల్ అత్యవసర హెచ్చరికను జారీ చేసింది. అంతర్జాతీయ సహాయం కోసం విజ్ఞప్తి చేసింది. కార్చిచ్చు కారణంగా జెరూసలెం శివార్లలో దాదాపు 3 వేల ఎకరాల మేర భూమి కాలి బూడిదైంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు 160కి పైగా అగ్నిమాపక బృందాలు, విమానాలు, హెలికాప్టర్లు నిరంతరాయంగా శ్రమిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. బలమైన గాలుల కారణంగా మంటలను ఆర్పడం కష్టమవుతోందని అధికారులు తెలిపారు. ఇది ఇజ్రాయెల్ చరిత్రలోనే అతిపెద్ద అగ్నిప్రమాదాల్లో ఒకటని పేర్కొన్నారు. కార్చిచ్చు కారణంగా పలు జాతీయ రహదారులను మూసివేశారు. ఈ మేరకు అగ్నిమాపక, రెస్క్యూ అథారిటీ జెరూసలేం జిల్లా డిప్యూటీ కమాండర్ ఇయాల్ కోహెన్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ ప్రాంతీయ పొరుగు దేశాలైన గ్రీస్, సైప్రస్, క్రొయేషియా, ఇటలీ నుండి అగ్నిమాపక సహాయాన్ని కోరినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని కాన్ టీవీ తెలిపింది.

## మధ్యే మార్గం ఉత్తమం


శక్తికి మించిన ఆరాధన చేయకూడదు. ఆరాధన, వినయ విధేయతల్లో మధ్యే మార్గం మంచిది. దాసుడు క్రమం తప్ప కుండా చేసే పనినే అల్లాహ్ ఇష్టపడతారు. ఎల్లప్పుడూ ఉపవాసాలు ఉండటం, నిత్యం రాత్రుళ్లు జాగారం చేసి ఆరాధనలు చేయడం వాంఛనీయం కాదు. 'ధర్మంలో తమకు తాముగా కాఠిన్యాన్ని సృష్టించుకున్నవారు నాశనమైపోతారు' అని దైవప్రవక్త (సల్లం) హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మధ్యే మార్గమే ఉత్తమమని ప్రవక్త(స) సెలవిచ్చారు. 'నేను అప్పుడప్పుడూ ఉపవాసాలు ఉంటాను, వాటిని విడిచి పెడతాను కూడా. నేను రాత్రిపూట ఆరాధనలో నిలబడతాను, నిద్రిస్తాను కూడా. ధార్మిక జీవనం గడుపుతూనే.. పెండ్లి చేసుకొని సంసారాన్ని కొనసాగిస్తాను' అని దైవప్రవక్త (స) తన ఆరాధన గురించి ఒకసారి ముగ్గురు వ్యక్తులకు స్పష్టం చేశారు. తన విధానాల పట్ల విముఖత ఉన్నవారు తన వారు కారని తెలిపారు. సఫిల్ ఉపవాసాలను అవసరమనుకుంటే ఉపసంహరించుకోవచ్చు. రాత్రి నిద్ర నుంచి మేల్కొని చేసే నమాజు ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ఉండాలి. అదే సమయంలో నిద్ర ముంచుకొస్తున్నప్పుడు నమాజ్ చేయకూడదు. ఇస్లాం ధర్మ నియమాలను ఆచరిస్తూనే.. ప్రాపంచిక జీవన బాధ్యతలను నెరవేర్చాలి. మనం మన చిత్త చాంచల్యాన్ని పూర్తిగా నిరోధించ లేకపోయినా.. దైవ నామస్మరణ ఎక్కువగా చేయడం ద్వారా మనస్సును అదుపులో పెట్టుకోవచ్చు. మన కండ్ల ముందు జరుగుతున్న తప్పును సరిదిద్దడం కూడా దైవారాధన లాంటిదే! మనం చేసేది చిన్న మంచి పని అయినా దానికి తగిన పుణ్యం లభిస్తుంది. దైవప్రవక్త (సల్లం) సూచించిన విధానంలో ఆరాధన చేస్తే పుణ్య ఫలాలు లభిస్తాయి. ఆయన సూచించింది మధ్యే మార్గమే.

- అర్షియా

## అల్లాహ్‌పై నమ్మకం... ఇహ పరాల సాఫల్యానికి సోపానం

విశ్వాసులకు అల్లాహ్ కరుణ మీద అపార నమ్మకం ఉంటుంది. ఎన్ని కఠోర పరిస్థితులు ఎదురైనా వారు దైవం మీదే విశ్వాసం ఉంచుతారు. ఆయన అత్యుత్తమ కార్య సాధకుడని వారు విశ్వసిస్తారు. దైవంపై నమ్మకం కలిగి ఉండటం స్వర్గ ప్రవేశానికి అర్హతను సంపాదించి పెడుతుంది. విశ్వాసులు ఉపాధి, ఆహారం లాంటి విషయాల కన్నా అల్లాహ్ చింతనపైనే ఎక్కువగా శ్రద్ధ కలిగి ఉంటారు. అల్లాహ్ మీద నమ్మకం ఉన్నవారికి ఆయన నుంచి తప్పక సాయం అందుతుంది. ఆయన మీద నమ్మకం కలిగి ఉండటం అంటే..ఆయన అభీష్టం ప్రకారమే పనులు జరుగుతాయన్న విశ్వాసాన్ని కలిగి ఉండటం. దైవ ప్రవక్త(సల్లం) బోధనల ప్రకారం.. "నేను దేవుడి పేరుతో పనులు ప్రారంభిస్తున్నాను. నేను ఆయన్నే నమ్ముకున్నాను. నేను పాపాల నుంచి మరలి పోవాలన్నా, మంచి పనులు చేయాలన్నా ఆయన శక్తి వల్లే సాధ్యమవుతుంది" అని పఠించి పనులకు ఉపక్రమించాలి. అప్పుడు నీకు సహాయం లభిస్తుందని.. నువ్వు రక్షించబడతావని ఖుర్‌ఆన్ అభయ మిస్తుంది. షైతాన్ అలాంటి వ్యక్తుల నుంచి దూరంగా పారిపోతాడు. విశ్వాసులు రాత్రి నిద్ర పోయే ముందు వుజూ చేయడం మంచి పని. హదీసులో చెప్పిన వీడ్కోలు వచనాలు పఠించడం వల్ల కూడా చక్కని ప్రయోజనం కలుగుతుంది. ధార్మిక విద్య నేర్చుకొనే విద్యార్థులను ముస్లిం సమాజం ఆర్థికంగా ఆదుకోవాలి. అలా చేస్తే దేవుడు మన సిరి సంపదల్లో శుభం కలుగజేస్తాడు. అభాగ్యులకు, నిరాశ్రయులకు సహాయం చేయడం వల్ల మనిషి ఉపాధి వికసిస్తుంది.

- అర్షియా




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**